www.vishalabharati.com
epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్
10.10.2024
సంపుటి:2 సంచిక:347

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక



..మిగతా 3 లో

## రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి






# సర్కారు బడుల్లో అత్యుత్తమ టీచర్లు

- మరి ప్రైవేటు బడులకు పిల్లలను ఎందుకు పంపుతున్నట్టు
- ఆ పరిస్థితిని కొత్తగా ఎంపికైన టీచర్లు మార్చాలి
- పేద విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలి
- సర్కారు బడుల రూపురేఖలు మార్చాలి
- ప్రైవేటు బడుల్లో సర్కారు బడిలో కంటే గొప్ప టీచర్లు ఉన్నారా?
- తెలంగాణ యువత మత్తుకు బానిసయ్యారు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎల్బీ స్టేడియంలో డీఎస్సీ విజేతలకు నియామక పత్రాల అందజేత

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

డీఎస్సీ విజేతలను చూస్తే దసరా పండుగ ముందే వచ్చినట్లు అనిపిస్తోందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. టీచర్లే తెలంగాణ వారధులు.. నిర్మాతలని, పేద విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే బాధ్యత వారిపైనే ఉందని తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో డీఎస్సీ విజేతలకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ కొత్త టీచర్లకు కీలక సూచనలు చేశారు. నిరుపేదలు బంగారం అమ్మి ప్రైవేటు పాఠశాలలకు పిల్లల్ని పంపే పరిస్థితి మారాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కొత్తగా నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులే ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించాలన్నారు. ‘‘తెలంగాణ బిడ్డలకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు వారిని భవిష్యత్తులో డాక్టర్లుగా, లాయర్లు, ఇంజినీర్లు, సైంటిస్టులు, ఐఏఎస్, ఐపీఎస్‌లు, ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మీదే. నేను ప్రభుత్వ బడిలో చదువుకున్నా.. సీఎం అయ్యాను. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేశవరావు, కోదండరాం వంటి ఎందరో ప్రభుత్వ బడిలోనే చదివారు. కార్పొరేట్ బడిలో చదువుకోలేదు. మీలాంటి టీచర్లు చెప్పిన చదువుతోనే ఈ స్థాయికి వచ్చాం. జాతి నిర్మాతలను తీర్చిదిద్దిన క్షేత్రం

..మిగతా 2 లో

# మందకృష్ణ అరెస్ట్

- హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా
- ఎస్సీ వర్గీకరణ పూర్తి చేయకుండా ప్రభుత్వ ఉద్యోగాలు ఎందుకు భర్తీ చేస్తారంటూ ప్రశ్న
- మందకృష్ణను అడ్డుకున్న పోలీసులు
- ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు మందకృష్ణ ర్యాలీ
- అదుపులోకి తీసుకున్న పోలీసులు



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ పూర్తి చేయకుండానే ప్రభుత్వ ఉద్యోగాలు ఎలా భర్తీ చేస్తారంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో భారీ ఎత్తున ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలని.. ఎమ్మార్పీఎస్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే.. హైదరాబాద్ పార్శీగుట్టలో ఉన్న ఎమ్మార్పీఎస్ భవనం నుంచి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు.. శ్రేణులతో కలిసి బయలు దేరిన మందకృష్ణ మాదిగను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు అడ్డుకున్నా సరే తమ ర్యాలీని కొనసాగిస్తామంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో మందకృష్ణ మాదిగను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం.. మందకృష్ణ మాదిగను గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించగా.. ఎమ్మార్పీఎస్ శ్రేణులను నగరంలోనే వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ

..మిగతా 2 లో

# అక్టోబరు 21 నుంచి గ్రూప్ 1 మెయిన్స్

- మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష
- అక్టోబర్ 14 నుంచి హాల్ టికెట్ల జారీ
- మొత్తం ఆరు పేపర్లు.. ఒక్కో పేపర్ కు 150 మార్కులు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో 'గ్రూప్ 1' మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. దీనిప్రకారం అక్టోబరు 21 నుంచి 27వరకు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయాతేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. అయితే మధ్యాహ్నం 12:30 నుంచే

..మిగతా 2 లో






2 లో

## వైద్యవిద్యార్థిని హత్యాచారం కేసు..

- 60 మంది సీనియర్ డాక్టర్ల రాజీనామా
- 50 మంది బోధనా సిబ్బంది ఇప్పటికే రిజైన్



## త్వరలోనే అందరికి రుణమాఫీ చేస్తాం

- ఆర్జాల బావి వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- ధాన్యం అమ్మిన మూడు రోజుల్లోనే అకౌంట్లో డబ్బులు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం అమ్మిన డబ్బులు మూడు రోజుల్లోనే వారి బ్యాంకు అకౌంట్లో జమ చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాల బావి వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్రంలోనే మొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..నల్గొండ జిల్లాలో గత సీజన్లో సైతం ధాన్యం కొన్న మూడు రోజుల్లోనే రైతులకు

..మిగతా 2 లో



2 లో

## ఖజానా పెరిగే మార్గాలను అన్వేషించండి



..మిగతా 3 లో

## కాంగ్రెస్ అంతర్గత విభేదాల వల్లే బీజేపీ గెలిచింది

# హిందువుల విభజనకు కాంగ్రెస్ కుట్ర

- దేశ ప్రజల్లో విషబీజాలు నాటుతోంది
- హర్యానాలో బీజేపీ చారిత్రాత్మక విజయం
- ఓటు బ్యాంకు రాజకీయాలను జనం తిరస్కరించారు
- కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోడీ విమర్శలు
- ప్రభుత్వ కార్యక్రమంలో రాజకీయ విమర్శలేంటని కాంగ్రెస్ ప్రశ్న

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. సమాజంలో కాంగ్రెస్ విష బీజాలు నాటుతూ..హిందువులను విభజించాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలను కేవలం ఓటు బ్యాంకు కోసమే వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. హరియాణా ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ(భాజపా) విజయాన్ని ప్రస్తావిస్తూ, అక్కడ కాంగ్రెస్ చేసిన కుట్రలన్నీ విఫలమయ్యాయని అన్నారు. మహారాష్ట్రలో రూ.7,600 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా

..మిగతా 2 లో






## మూసీ ప్రక్షాళనకు లక్షా 50 వేల కోట్లు ఎక్కడివి?

- రైతు రుణమాఫీకి మాత్రం పైసలు ఉండవా?
- రాహుల్ జీ 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ?
- మీ కోసం అశోక్ నగర్ నిరుద్యోగులు వేచి చూస్తున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు పైసలు లేవంట.. కానీ మూసీ ప్రక్షాళన కోసం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తాడంట.. అని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్

..మిగతా 2 లో

# ఖజానా పెరిగే మార్గాలను అన్వేషించండి

- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



ధరలు పెంచకుండా, రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెరిగే మార్గాలను అన్వేషించాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆర్థికశాఖతో పాటు ఖజానాకు ఆదాయాన్ని అందించే వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, ఆర్అండ్బీ, గనులు, పురపాలక, గృహనిర్మాణ శాఖల అధికారులతో డిప్యూటీ సీఎం సచివాలయంలో సమావేశమయ్యారు. ఆదాయం పెంచే విషయమై ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఖజానాకు ఆదాయం పెంచేందుకు నిర్దిష్ట ప్రణాళికతో అధికారులు రావాలని భట్టి సూచించారు. గతంలో నిర్దేశించుకున్న ప్రణాళికలు, వాటి ప్రగతిని నివేదించాలని చెప్పారు. లీకేజీలను అరికడుతూ ఆదాయం పెంచేందుకు వాణిజ్యపన్నుల శాఖ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. మద్యం దుకాణాల్లో కనీస ధర కన్నా అధిక రేట్లతో విక్రయాలు జరుగుతున్నాయని వాటిని అరికట్టేందుకు ఎన్ఫోర్స్మెంట్ విభాగాన్ని బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. ఖజానాకు ఆదాయం పెంచేందుకు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అందుకోసం ప్రత్యేకంగా ఉమ్మడి సమావేశాలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణా, పనుల ఎగవేతను కట్టడి చేయడానికి వాణిజ్య పన్నులు, ఆర్అండ్బీ, ఇతర శాఖల అధికారులు సమావేశమై నివేదిక రూపొందించాలని అన్నారు. నిర్మాణాలు పూర్తిచేసి పెండింగ్లో ఉన్నరాజీవ్ స్వగృహ, గృహనిర్మాణ శాఖ పరిధిలోని ఇండ్లను విక్రయించే అంశంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇసుక రీచ్ల ద్వారా ఖజానాకు గరిష్ట ఆదాయం సమకూరేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీనియర్ అధికారులు సమావేశమై నివేదిక ఇవ్వాలని భట్టివిక్రమార్క ఆదేశించారు.

# సర్కారు బడుల్లో అత్యుత్తమ టీచర్లు

**మొదటి పేజీ తరువాయి**

ఈ స్థాయికి వచ్చాం. జాతి నిర్మాతలను తీర్చిదిద్దిన క్షేత్రం ప్రభుత్వ బడి. తెలంగాణలో 30వేల పాఠశాలలు ఉంటే.. 24లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు యాజమాన్యంలో 10 వేల పాఠశాలలు ఉంటే 34లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటులో మీకంటే ఎక్కువ చదువుకున్నవారు, మీకన్నా గొప్ప వ్యక్తులు, అనుభవం ఉన్నవారు బోధిస్తున్నారా?'' అని ప్రశ్నించారు.

**ఎందుకలా జరుగుతోందో ఆలోచించండి..**

''ప్రభుత్వ బడికి వెళ్లడమంటేనే గ్రామాల్లో సైతం నామోషీగా భావిస్తున్నారు. ఉపాధి హామీ కూలికి పోయిన వారు కూడా తాము తిన్నా తినకపోయినా, పుస్తెలు అమ్మి అయినా తమ పిల్లలను ప్రైవేటు బడి, కాన్వెంట్కు పంపాలనుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలకు పంపాలంటే.. ఎందుకు ఇబ్బందిపడుతున్నారో ఆలోచించండి. మీకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించే బాధ్యత నేను తీసుకుంటా.. కానీ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు మీరు కృషిచేయండి. స్కూళ్లలో అన్ని వసతులూ కల్పించేందుకు కృషిచేస్తున్నాం. అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ప్రారంభిస్తున్నాం. ఈ నెల 11న ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు శ్రీకారం చుడుతున్నాం. విద్యకు బడ్జెట్ లో రూ.25వేల కోట్లు కేటాయించాం. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునీకరిస్తున్నాం.



**65 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తిచేశాం..**

''ప్రత్యేక తెలంగాణ కోసం నిరుద్యోగులు ఆత్మబలిదానాలు చేసుకున్నారు. రెండుసార్లు కోరి బీఆర్ఎస్కు అధికారం ఇచ్చాం. ప్రత్యేక తెలంగాణలో ఉద్యోగాలు భర్తీ అవుతాయని అందరూ ఆశించినా.. తెలంగాణ వచ్చిన మూడేళ్లకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన రెండేళ్లకు నియామక ప్రక్రియ పూర్తి చేశారు. గత ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలు తీర్చలేదు. యువతకు ఉద్యోగాలు రావాలంటే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్రావు, కవిత ఉద్యోగాలు ఊడాలని గతంలో చెప్పాను. కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని నిరుద్యోగులు బాధ్యత తీసుకున్నారు. 90 రోజుల్లో 30వేల కొలువులు భర్తీ చేసి నియామక పత్రాలు అందజేశాం. 65 రోజుల్లో డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి చేశాం.

**పేదల గురించి ఆలోచించలేదు గానీ.. కవితకు ఎమ్మెల్సీ పదవి..**

రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రభుత్వ బడుల పాత్ర కీలకం. డీఎస్సీ నోటిఫికేషన్ అడ్డుకోవాలని ప్రతిపక్షాలు యత్నించాయి. కేసులు వేసి డీఎస్సీ నోటిఫికేషన్ అడ్డుకోవడానికి కుట్రలు చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భవిష్యత్తు తరాలకు టీచర్లు ఆదర్శంగా మారబోతున్నారు. డీఎస్సీ విజేతల సంతోషాన్ని చూసి కొందరు కళ్లల్లో కారం పెట్టుకొంటారు. ఎంపీగా కవిత ఓడిపోగానే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పేదల గురించి ఆలోచించలేదు గానీ.. కుమార్తెకు మాత్రం 6 నెలల్లో ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పేదల మేలు కోసం విశ్రాంతి తీసుకోకుండా శ్రమిస్తున్నాం. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలి. తెలంగాణ సమాజంపై బీఆర్ఎస్కు ఎందుకంత కోపం? ఏడు లోక్సభ స్థానాల్లో బీఆర్ఎస్కు డిపాజిట్లు పోయాయి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు మాకు అధికారం ఇచ్చారు. మా ప్రభుత్వాన్ని పడగొడతామని బీఆర్ఎస్ అంటోంది.. ఇది న్యాయమా? బీఆర్ఎస్కు అధికారం రాదు.. తెలంగాణ ప్రజలు ఇవ్వరు?

**ఒలింపిక్స్‌లో పతకాలు రావడంలేదెందుకు?**

**విద్యార్థులకు సాంకేతిక శిక్షణ ఇచ్చి.. ఉద్యోగ అవకాశాలను పెంపొందిస్తాం. రాష్ట్రంలో ఏటా 1.10లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ పట్టాలు పొందుతున్నారు. నైపుణ్యాలు పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని ప్రారంభించాం. స్కిల్ వర్సిటీ ద్వారా సాంకేతిక నైపుణ్యం అందిస్తున్నాం. ఒలింపిక్స్ వేదికల్లో దేశం పరిస్థితి ఏంటో చూశాం. నాలుగు కోట్లు జనాభా ఉన్న దక్షిణ కొరియాకు ఒలింపిక్స్‌లో 32 పతకాలు వస్తే.. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌కు ఆ తరహాలో ఒలింపిక్స్‌లో ఎందుకు పతకాలు రాలేదు? తెలంగాణ యువత మత్తుకు బానిసలయ్యారు. వ్యసనాలకు బానిసలై.. యువత తప్పదోవ పడుతున్నారు. 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లకు బంగారు పతకాలు రావాలి" అని పిలుపునిచ్చారు.**

# వర్గీకరణ తర్వాతే ఉద్యోగ ప్రకటనలు

- ముఖ్యమంత్రి రేవంత్ సంచలన నిర్ణయం
- వన్ మెన్ కమిషన్ వేయాలని ఆదేశం
- 60 రోజుల్లోనే నివేదిక..

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ఉద్యోగాల భర్తీ , ఎస్సీ వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సబ్ కమిటీ సూచనల ఆధారంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణపై 60 రోజుల్లో వన్ మెన్ కమిషన్ రిపోర్ట్ సమర్పించాలని .. వన్ మెన్ కమిషన్ రిపోర్ట్ సమర్పించాకే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని రేవంత్ నిర్ణయించారు. 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని వన్ మెన్ కమిషన్ రిపోర్టు ఇవ్వనుంది. 24గంటల్లో కమిషన్ కు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో గడువులోగా వన్ మెన్ కమిషన్ రిపోర్టు సమర్పించాల్సిందేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేసారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయకుండానే ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్గీకరణ చేయకుండానే 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయడానికి నిరసనగా ప్రదర్శనలు చేయాలని పిలుపునిచ్చారు. తాను స్వయంగా ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు బయల్దేరిన మంద కృష్ణ మాదిగను పోలీసులు అడ్డుకున్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే వరకు, మాదిగల వాటా తేలే వరకు ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు జరపొద్దని మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఈ అంశం రేవంత్ రెడ్డి దృష్టికి వెళ్లడంతో ఇక నుంచి ఎస్సీ వర్గీకరణ చేసిన తర్వాతనే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తామని ప్రకటించారు. గత ఆగస్టులో ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీఎం రేవంత్ రెడ్డి స్వాగతించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్ 3, 2023న మాజీ డిప్యూటీ సిఎం దామోదర రాజనరసింహ నేతృత్వంలో ఢిల్లీకి పంపి, సుప్రీం కోర్టులో బలమైన వాదనల్ని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వినిపించిందని అప్పట్లో అసెంబ్లీలో తెలిపారు. అవసరమైతే ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలో వర్గీకరణ చేయడానికి అవసరమైతే ఆర్డినెన్స్ తెచ్చి రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పారు. కానీ అలాంటి ప్రయత్నం చేయకుండా ఉద్యోగాలను భర్తీ చేయడంతో మందకృష్ణ మండిపడుతున్నారు. ఇప్పటికే ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలో మార్పులు చేస్తే కోర్టు సమస్యలు వస్తాయని అందుకే.. ఆర్డినెన్స్ లాంటి వాటి జోలికి వెళ్లకుండా ముందుగా వన్ మెన్ కమిషన్ వేసి.. గడువులోకగా నివేదిక వచ్చేలా చేసి.. ఆ తర్వాతనే నోటిఫికేషన్లు ఇస్తామని రేవంత్ ప్రకటించారు. మందకృష్ణ ఈ విషయంలో శాంతిస్తారో లేదో చూడాల్సి ఉంది.

# మందకృష్ణ అరెస్ట్

**మొదటి పేజీ తరువాయి**



చేయకుండానే ప్రభుత్వ ఉద్యోగాలను ఎలా భర్తీ చేస్తారని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని మందకృష్ణమాదిగ ప్రశ్నించారు. వర్గీకరణ చేయకుండానే 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్న నేపథ్యంలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండానే ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయ నియామక పత్రాలు ఇవ్వడంపై మందకృష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రక్రియ ఎలా చేపడతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా చేపట్టే ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు పాటించాలంటూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలను , కార్యకర్తలు ఉద్యమకారులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని మందకృష్ణ ప్రశ్నించారు. ర్యాలీలు నిర్వహిస్తున్న వారిని అడ్డుకొని అరెస్ట్ చేయడం దారుణమంటూ మందకృష్ణ మాదిగ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మాదిగలకు అన్యాయం చేయడానికే రేవంత్ రెడ్డి సర్కార్.. మాలలతో కుమ్మక్కై మాదిగలను మోసం చేస్తున్నారని మందకృష్ణ మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే వరకు.. మాదిగల వాటా తేలే వరకు ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు జరపొద్దని మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు.

# అక్టోబరు 21 నుంచి గ్రూప్ 1 మెయిన్స్

**మొదటి పేజీ తరువాయి**

అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నారు. మధ్యాహ్నం 1.30 తర్వాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించరు. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను అక్టోబరు 14 నుంచి వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచనున్నారు. అభ్యర్థులు హాల్ టికెట్ లో పొందుపరిచిన అన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది.

రాష్ట్రంలో 563 గ్రూప్ 1 పోస్టుల భర్తీకి 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. జూన్ 9న గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఎగ్జామ్ కు మొత్తం 3.02 లక్షల మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్ష ఫలితాలను జులై 7న విడుదల చేశారు. ఇందులో 31,382 మంది అభ్యర్థులు గ్రూప్ 1 మెయిన్స్‌కు అర్హత సాధించారు. వీరికి అక్టోబరు 21 నుంచి మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు.

**మెయిన్స్ పరీక్ష విధానం..**

గ్రూప్ 1 మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లు ఉంటాయి. ప్రతీ పేపర్‌ను 150 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం 3 గంటలు. మెయిన్ పరీక్షలను ప్రతీ రోజు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహిస్తారు. మెయిన్ పరీక్షలో జనరల్ ఇంగ్లిష్ తప్ప మిగిలిన పేపర్లను అభ్యర్థులు ఎంచుకున్న భాషల్లో రాయాలి. గ్రూప్ 1 మెయిన్స్ లో మొత్తం 06 పేపర్లు ఉంటాయి. వీటిని అభ్యర్థి ముందుగా ఎంచుకున్న మాధ్యమంలోనే రాయాల్సి ఉంటుంది. పేపర్‌లో కొంత భాగాన్ని ఇతర భాషలో రాయడానికి అభ్యర్థికి అనుమతి లేదు.

మెయిన్ పరీక్ష కేంద్రాలు: ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ. తెలంగాణలో 563 గ్రూప్ 1 పోస్టుల భర్తీకీ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫిబ్రవరి 19న నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అభ్యర్థుల నుంచి ఫిబ్రవరి 23 నుంచి మార్చి 14 వరకు దరఖాస్తులు స్వీకరించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4.8 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గ్రూప్ 1 పోస్టుల భర్తీకి జూన్ 9న నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 895 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. జూన్ 9న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రూప్ 1 స్క్రీనింగ్ టెస్ట్ (ప్రిలిమినరీ పరీక్ష) నిర్వహించారు. గ్రూప్ 1 పరీక్ష కోసం మొత్తం 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కేవలం 3.02 లక్షల మంది మాత్రమే (74 శాతం) ప్రిలిమ్స్ పరీక్షకు హాజరయ్యారు. ప్రిలిమ్స్ పరీక్ష ఫలితాలను టీజీపీఎస్సీ జులై 7న విడుదల చేసింది. ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత సాధించినవారికి మెయిన్స్ పరీక్షలు నిర్వహించనుంది.

**గ్రూప్-1 మెయిన్స్ 2024 పరీక్షల షెడ్యూలు..**

- 21.10.2024: జనరల్ ఇంగ్లిష్ (క్వాలిఫైయింగ్ టెస్ట్)
- 22.10.2024: పేపర్-1 (జనరల్ ఎస్సే)
- 23.10.2024: పేపర్-2 (హిస్టరీ, కల్చర్ అండ్ జియోగ్రఫీ)
- 24.10.2024: పేపర్-3 (ఇండియన్ సొసైటీ, కానస్టిట్యూషన్ అండ్ గవర్నెన్స్)
- 25.10.2024: పేపర్-4 (ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్)
- 26.10.2024: పేపర్-5 (సైన్స్ & టెక్నాలజీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్)
- 27.10.2024: పేపర్-6 (తెలంగాణ ఉద్యమం, రాష్ట్రావతరణ)



# మూసీ ప్రక్షాళకు లక్షా 50 వేల కోట్లు ఎక్కడివి?

**మొదటి పేజీ తరువాయి**

వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ సీనియర్ లీడర్ మహమ్మద్ అలావుద్దీన్ పటేల్ సహా ఆయన అనుచరులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ జాబ్ పొగొట్టండి. మీకు ఏడాది లో 2 లక్షల ఉద్యోగాలంటూ రాహుల్ గాంధీ అశోక్ నగర్‌కు వచ్చి ఇది నా గ్యారంటీ అని హామీ ఇచ్చాడు. కానీ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డికి తప్ప తెలంగాణ యువతకు ఉద్యోగాలు రాలేదని కేటీఆర్ తెలిపారు. మహిళలకు రూ. 2500 ఇస్తా అన్నాడు. కోటి 60 లక్షల మంది మహిళలు రూ. 2500ల కోసం వేచి చూస్తున్నారు. వృద్ధులకు రూ. 4 వేలు అన్నాడు. ఇంట్లో ఇద్దరికీ పింఛన్ అన్నాడు. ఒక్కరికన్నా వచ్చిందా? అంటే లేనే లేదు. ఉన్న రైతు బంధు, ఉన్న పింఛన్ కూడా వస్తలేదు. వాళ్లు 420 హామీలు ఇచ్చారు. ఇప్పుడు ఏమైనయ్ అంటే సమాధానం చెబుతలేదు. కళ్యాణ లక్ష్మి పేరుతో తులం బంగారం ఇస్తా అన్నాడు. తులం ఇనుము కూడా ఇవ్వడని కేటీఆర్ విమర్శించారు. సంక్షేమ పథకాల కోసం పైసలు ఇస్తే మీరు కమీషన్‌లు ఇవ్వరు కదా? అదే మూసీ ప్రాజెక్ట్ అయితే లక్షా కోట్లు మింగొచ్చు. రాహుల్ గాంధీ, వాళ్ల బావకు కోట్ల రూపాయలు దోచి పెట్టొచ్చు. మనం గల్లా పట్టి అడిగే వరకు ఈ కాంగ్రెస్ పార్టీ మోసం కొనసాగుతూనే ఉంటది. మనం ఏదైనా సమస్య వస్తే కలెక్టర్లకు చెప్పాలంట. ఇంటింటికి ఓట్ల కోసం వచ్చిన వాళ్లను మాత్రం అడగవద్దంట. ప్రజలకు ఏం ఖర్మ. ఎవరైతే మనకు తప్పుడు హామీలు ఇచ్చారో వాళ్లనే పట్టుకోవాలే. కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులను పట్టుకొని మనం అడగాలె అని కేటీఆర్ సూచించారు.



# త్వరలోనే అందరికి రుణమాఫీ చేస్తాం

**మొదటి పేజీ తరువాయి**

చెల్లింపులు చేశారని గుర్తు చేశారు. వానకాలం ధాన్యానికి సంబంధించి రైతులకు ఏవైనా ఇబ్బం దులు ఏర్పడిన లేదా చెల్లింపులు ఆలస్యమైన జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు ఫోన్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ప్రత్యేకించి సన్న ధాన్యానికి 500 రూపాయల బోనస్ సైతం ఇస్తున్నదని పేర్కొన్నారు. గ్రేడ్ ఏ ధాన్యానికి క్వింటాలుకు 2320 రూపాయల మద్దతు ధర, సాధారణ రకానికి 2320 రూపాయలు ప్రభుత్వం మద్దతు ధరలను ప్రకటించిందన్నారు. మిల్లర్లు సన్న బియ్యంతో పాటు, దొడ్డు రకానికి సైతం ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా దొడ్డు ధాన్యాన్ని తీసుకోవాలని సూచించారు. రెండు లక్షల కన్నా ఎక్కువ ఉన్న వారి రుణాలను వారం పది రోజుల్లో రుణమాఫీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

**క్రీడారంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే ముందుంచేందుకు ప్రభుత్వం కృషి**

**క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం**

క్రీడారంగంలో తెలంగాణను దేశంలోనే ముందుంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని చెప్పారు.

బుధవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన ఖేలో ఇండియా వుమెన్ ఖో ఖో తెలంగాణ రాష్ట్ర సెలక్షన్ ట్రయల్స్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతీయస్థాయి సెలక్షన్స్ కు నిర్వహిస్తున్న ట్రయల్స్ లో క్రీడాకారులందరూ రాణించాలని కోరారు. గతంలో తెలంగాణకు ఈ క్రీడలలో సిల్వర్ మెడల్ వచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే క్రీడారంగంలో ముందుంచేలా ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఇందులో భాగంగా గచ్చిబౌలిలో స్పోర్ట్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి భవిష్యత్ ఒలంపిక్స్ లో రాష్ట్రం ముందుండే విధంగా చూస్తున్నదని చెప్పారు. ఆటో డ్రైవర్ కుమారుడైన టాప్ బౌలర్ సిరాజ్ కు ప్రభుత్వం తరపున గ్రూప్ వన్ ఉద్యోగంతో పాటు, 500 గజాల స్థలాన్ని, అన్ని రకాల సౌకర్యాలు కల్పించిందని చెప్పారు.

విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల్లో పాల్గొనాలని మంత్రి కోరారు. జనాభాలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్న భారత్ ఒలంపిక్స్ పథకాల్లో చివరి నుండి రెండో స్థానంలో ఉందని, సౌత్ కొరియా లాంటి చిన్న దేశం రెండు వందల మెడల్స్ సాధిస్తే మన దేశం రెండు మెడల్స్ సాధించడం బాధాకరమైన విషయం అని అన్నారు .ప్రతి ఒక్కరికి చదువు ఎంత ముఖ్యమో, ఆటలు కూడా అంతే ముఖ్యమని, చదువుతోపాటు ఆటలపై శ్రద్ధ చూపిస్తే శారీరకంగా ,మానసికంగా సామర్థ్యాలను కలిగి ఉంటారని అన్నారు. ఉమెన్ ఖో ఖో క్రీడాకారులకు ప్రతీక్ ఫౌండేషన్ తరపున ట్రాక్ సూట్ కొనుగోలుకై రెండు లక్షల రూపాయల ఇస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రస్థాయిలో ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఒక టోర్నమెంట్ నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి ప్రకటించారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, ఖేలో ఇండియా ఉమెన్ ఖో ఖో జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడారు.

# హిందువుల విభజనకు కాంగ్రెస్ కుట్ర

**మొదటి పేజీ తరువాయి**



ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. హరియాణా ఎన్నికల్లో భాజపా చారిత్రాత్మక విజయం దేశ ప్రజల ఆలోచనను తెలియజేస్తోందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆదివాసీలు, ఇతర వెనుకబడిన తరగతులు (ఓబీసీలు), దళితులు భాజపాకు అండగా నిలిచారని పేర్కొన్నారు. "కాంగ్రెస్ తమ రిజర్వేషన్లను లాక్కొని తమను ఓటు బ్యాంకుగా వాడుకుంటోందని దళితులు గ్రహించారు. దేశంలోని రైతులను కూడా కాంగ్రెస్ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. కానీ, తమకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ఎవరు ఇచ్చారో హరియాణా రైతులకు తెలుసు కాబట్టే వారు భాజపాను గెలిపించారు. ప్రజలు కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెప్పారు'' అని మోదీ అన్నారు. హరియాణాలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో ప్రజల్లో తమను తప్పుగా చూపించడానికి ఎన్నో కథనాలు రచించి.. ద్వేషపూరిత రాజకీయాలకు పాల్పడిందని ఆరోపించారు. సమాజాన్ని నాశనం చేయడానికి పూనుకున్న ఈ శక్తులన్నింటికీ రాబోయే ఎన్నికల్లో మహారాష్ట్ర ప్రజలు తగిన సమాధానం ఇస్తారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రజలు భాజపామహాయుతి ప్రభుత్వానికి ఓటు వేయాలని కోరారు.

**కాంగ్రెస్ మండిపాటు..**

ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఖండించారు. ప్రధాని రాజకీయ ప్రసంగాల కోసం ప్రభుత్వ కార్యక్రమాలను ఎందుకు ఉపయోగించుకుంటున్నారని ప్రశ్నించారు. ఇలాంటి ప్రసంగాల కోసం ప్రజల డబ్బును దుర్వినియోగం చేయకుండా భాజపా సొంత సొమ్ముతో వేదికలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



# వైద్యవిద్యార్థిని హత్యాచారం కేసు..

- కొనసాగుతున్న రాజీనామాల పర్వం
- 60 మంది సీనియర్ డాక్టర్ల రాజీనామా
- 50 మంది బోధనా సిబ్బంది ఇప్పటికే రిజైన్
- కొనసాగుతున్న ఆందోళనలు
- దేశవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాకు చెందిన ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థిని హత్యాచారం ఘటన నేపథ్యంలో వైద్యుల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. మృతురాలికి న్యాయం జరగాలంటూ జూనియర్ వైద్యులు చేపట్టిన నిరాహార దీక్షకు మద్దతుగా కోల్‌కతాలోని కలకత్తా మెడికల్ కాలేజ్‌కు చెందిన 60 మంది సీనియర్ డాక్టర్లు తమ రాజీనామాలను సమర్పించారు. మంగళవారం ఆర్జీకర్ ఆసుపత్రికి చెందిన 50 మంది సీనియర్ వైద్యులు, బోధనా సిబ్బంది మూకుమ్మడిగా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. వీరంతా రాజీనామా పత్రంపై సంతకాలు చేస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. కోల్‌కతాలోని ఆర్జీ కర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఆగస్టు 9న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. బాధితురాలికి న్యాయం చేయాలని వైద్య విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలు కొనసాగించారు. సీఎం మమతా బెనర్జీ విజ్ఞప్తి మేరకు ప్రభుత్వంతో చర్చలు జరిపారు. తమ డిమాండ్లను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వడంతో.. 42 రోజుల పాటు కొనసాగిన నిరసనలు విరమించి గత నెల 21న పాక్షికంగా విధుల్లో చేరారు. అయితే తమ భద్రతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సానుకూల చర్యలు లేవని, మృతురాలికి న్యాయం జరగాలంటూ ఏడుగురు జూనియర్ వైద్యులు నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు ప్రముఖ వైద్య కళాశాలల్లో మూకుమ్మడి రాజీనామాలు చోటుచేసుకున్నాయి

# పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆసరాగా కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్

- కాంగ్రెస్ ఇచ్చిన తులం బంగారం హామీ నెరవేరలేదు
- బతుకమ్మ చీరలు పంపిణీ చేయలేదు
- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



**బాల్కొండ, విశాల భారతి** పేదింటి అడబిడ్డ పెళ్లికి ఆసరాగా ఉండటానికి ఒక మేనమామ కట్నంగా తెలంగాణ తొలి సిఎం కేసిఆర్ కళ్యాణ లక్ష్మీ,షాది ముబారక్ పథకాన్ని ప్రారంభించారని మాజి మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బుధవారం బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని వేల్పూర్,బాల్కొండ,కమ్మర్ పల్లి,మోర్తాడ్ మండలాలకు చెందిన లబ్దిదారులకు ఆయన కళ్యాణ లక్ష్మీ,షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా ఇచ్చిన తులం బంగారం హామీ నెరవేర్చలేదని అన్నారు. తులం బంగారం కావాలి అన్నవారు చేతులు ఎత్తాలని వేముల కోరడంతో మహిళలు అందరూ చేతులెత్తారు. దాంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుండి ఇప్పటి వరకు కళ్యాణ లక్ష్మీ,షాది ముబారక్ చెక్ లు అందుకున్న వారందరికి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇవ్వాలని అడబిడ్డల పక్షాన సిఎం రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.ఎన్నికల్లో ఇచ్చిన మాటను గుర్తు చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు అసహనానికి గురవుతున్నారని, అనవసర రాద్ధాంతం, రాజకీయం చేస్తున్నారని తెలిపారు. ఇంకా గత ప్రభుత్వంపై నిందలు మోపి తప్పించుకుంటున్నారని అన్నారు.గత ప్రభుత్వంలో కేసీఆర్ దసరా పండుగకు పేదింటి అడబిడ్డలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేసినారు.ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు చీరలు పంపిణీ చేయలేదని తెలిపారు.ప్రతి మహిళకు 2500 ఇవ్వటం లేదు, కేసీఆర్ కిట్ ఆపేశారు. వృద్ధులకు, వింతతువులకు, ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు 4000 పెన్షన్ ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల్లో పేద ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ సక్రమంగా అమలు చేయకుండా 1,50,000 కోట్లతో ఎవరికి పనికిరాని మూసి ప్రక్షాళన చేస్తామంటున్నారు. పేద ప్రజల పట్ల ఈ ప్రాధాన్యత ఏంటో ప్రజలు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు,ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ నాయకులను నిలదీసిన మహిళలు**

వేల్పూర్ లో ఎమ్మెల్యే వేముల వెళ్లిన అనంతరం మహిళలు తమ కూతురు పెళ్లిల్లు ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే జరిగాయని, తమకు తులం బంగారం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులని నిలదీశారు.



# కాంగ్రెస్ అంతర్గత విభేదాల వల్లే బీజేపీ గెలిచింది

- తమ ఓటమికి ఈవీఎంలను తప్పుపట్టడం సరికాదు
- ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీపై గెలుపును చేజేతులారా జారవిడుచుకున్నారంటూ కాంగ్రెస్ పార్టీపై ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ బుధవారంనాడు విమర్శలు గుప్పించారు. తమ ఓటమికి ఈవీఎంలను కాంగ్రెస్ తప్పుపట్టడంపై ఆక్షేపణ తెలిపారు. ఈవీఎంలను తప్పుపట్టడం చాలా సులభమని, ఈవీఎంల వల్ల మీరు (కాంగ్రెస్) నెగ్గినప్పుడు మాట్లాడరని, ఓడిపోతే మాత్రం ఈవీఎంలను తప్పుపడుతుంటారని అన్నారు.ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయేందుకు అనేక ప్రతికూల అంశాలు ఉన్నాయి. హర్యానాలో ప్రభుత్వ వ్యతిరేకత ఉంది. కాంగ్రెస్ పార్టీ అంతర్గత విభేదాల వల్లే బీజేపీ గెలిచింది. పరిస్థితిని బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకుంది'' అని ఒవైసీ విశ్లేషించారు. పదేళ్ల బీజేపీ పాలనలో ప్రభుత్వ వ్యతిరేకతను కాంగ్రెస్ పార్టీ సమర్ధవంతంగా ఉపయోగించుకుని ఉండాల్సిందని, కానీ ఆ పార్టీ అంతర్గత వ్యవహారాలు బీజేపీకి లబ్ధి చేకూర్చాయని అన్నారు. బీజేపీకి ఏ చిన్న అవకాశం ఇచ్చినా ఎన్నికల్లో దానిని తమకు అనూకులంగా మార్చుకుంటుందని చెప్పారు. బీజేపీ విజయానికి విద్వేష ప్రచారమే కారణమని అనడం సరికాదని 2024 పార్లమెంటు ఎన్నికల తర్వాత కూడా తాను చెప్పానని, సమయం వచ్చినప్పుడు కూడా తాను తరచు ఈ విషయం చెబుతూనే ఉంటానని అన్నారు. ''మరి బీజేపీ విజయానికి కారణం ఎవరు? మీరే (కాంగ్రెస్) ప్రధాన విపక్షంగా ఉన్నారు. బీజేపీని ఓడించే సువర్ణావకాశం మీకు ఉంది. కానీ ఆ అవకాశం ఉపయోగించుకోవడంలో మీరు విఫలం అయ్యారు" అని కాంగ్రెస్ పార్టీని ఒవైసీ తప్పుపట్టారు. హర్యానా ఫలితాలను తాము అంగీకరించడం లేదని, అనేక చోట్ల పోలింగ్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, ఈవీఎం తప్పిదాలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ నేతలు పలువురు ఆరోపించారు. హిసార్, మహేంద్రగఢ్, పానిపట్ లలో 99 శాతం బ్యాటరీ ఉన్న మిషీన్లతో బీజేపీ గెలిచిందని, కాంగ్రెస్ 6070 బ్యాటరీ లెవల్స్ ఉన్న ఈవీఎంలతో గెలిచిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సైతం వివిధ నియోజకవర్గాల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, వాటిని భారత ఎన్నికల కమిషన్ దృష్టికి తెస్తామని చెప్పారు. కాగా, ఫలితాలను అప్‌డేట్ చేయడంలో జాప్యం జరిగిందని కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ ఇప్పటికే ఆరోపణలను చేయగా, వాటిని ఈసీఐ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలని కొట్టిపారేసింది



# కలెక్టరేట్ లో బతుకమ్మ సవ్వడి

- అన్ని శాఖల సమన్వయంతో బతుకమ్మ సంబరాలు

**వనపర్తి, విశాల భారతి::** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను భావి తరాలకు అందించటానికి బతుకమ్మ పండుగను ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించాలని జిల్లా కలక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. స్వయం సహాయక మహిళా సంఘాలు, మెప్మా, స్త్రీ శిశు సంక్షేమ శాఖకు చెందిన మహిళా సిబ్బంది తీరొక్క పువ్వులతో బతుకమ్మలను తయారు చేసి తీసుకొచ్చారు.

**అంబరనంటిన బతుకమ్మ సంబరాలు:**

తీరొక్క పువ్వులతో, పసుపు కుంకుమలతో అలంకరించిన బతుకమ్మలను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్ (స్థానిక సంస్థలు), నగేష్ (రెవెన్యూ) లతో కలిసి బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఆటపాటలతో ఐ .డి. ఒ.సి ప్రాంగణం పలకరించే విధంగా ఆట పాటలతో అలరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదర్శ సురభి మాట్లాడుతూ..తెలంగాణ సంస్కృతిలో భాగమైన బతుకమ్మ పండుగ రాష్ట్రంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొంది ప్రత్యేకతను సంతరించకుందన్నారు. మానవాళిని ప్రకృతికి దగ్గర చేసే కార్యక్రమం బతుకమ్మ పండుగని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు గుర్తింపుగా నిలిచిన బతుకమ్మ ఉత్సవాలు మనంగా జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. చక్కటి బతుకమ్మలను తయారు చేసిన వారికి బహుమతి ప్రదానం చేశారు. బతుకమ్మ సంబరాలను వచ్చే సంవత్సరం మరిత ఘనంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా ప్రజలకు బతుకమ్మ, విజయ దశమి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సంబురాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ పీడీ ఉమాదేవి, డిఎస్సీడిఓ నుషిత, జిల్లా సంక్షేమధికారి లక్ష్మమ్మ, ఇతర జిల్లా శాఖల అధికారులు, మెప్మా సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది. ఇతర మహిళా ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.



# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ


- కలెక్టరేట్ లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**సూర్యాపేట, విశాల భారతి** సంస్కృతి, సంప్రదాయాలకి ప్రతీకగా తెలంగాణలో బతుకమ్మ పండుగ నిలుస్తుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో ఐ సి డి ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ముఖ్య అతిధిగా సతీమణి తో కలిసి జిల్లా కలెక్టర్ గౌరవమ్మ కి పూజలు నిర్వహించి, బతుకమ్మ సంబరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు, సిబ్బందికి ముందుగా బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ జిల్లా ప్రజలు, సిబ్బంది ఎప్పుడు ఆడుతూ, పాడుతూ సంతోషంగా ఉండాలన్నారు. బతుకమ్మ పండుగ మహిళలకి ప్రత్యేకమని ప్రకృతి లో లభించే పూలను సేకరించి అందంగా బతుకమ్మ పేర్చి పూజిస్తారని, చిన్న పెద్దలందరు తొమ్మిది రోజులు పాటు పాటలు పాడుకుంటూ బతుకమ్మ ఆడుకుంటారన్నారు. అదనపు కలెక్టర్ బి ఎస్ లత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రములో ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ నేడు దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందని సిబ్బందితో బతుకమ్మ ఆడటం చాలా సంతోషంగా ఉందని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పవర్ గ్రిడ్ సి యం డి అరుణ్ కుమార్,డి ఆర్ డి ఓ పిడి వి వి అప్పారావు,డి డబ్ల్యూ ఓ నరసింహారావు,డి టి డి ఓ శంకర్,డి ఎస్ సి వెల్ఫేర్ అధికారి లత, బిసి వెల్ఫేర్ అధికారి అనసూర్య,డి సి ఓ పద్మ,పరిపాలనధికారి సుదర్శన్ రెడ్డి, సూపరిటీడెంట్ పద్మారావు,టి యన్ జి ఓ కార్యదర్శి శ్యామ్, ఉద్యోగులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాబాపూర్ లో వైభవంగా దేవి నవరాత్రి ఉత్సవాలు



**బాల్కొండ, విశాల భారతి** భీమ్‌గల్ మండలం బాబాపూర్ గ్రామంలో మున్నురుకాపు సంఘం అధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజుకు ఒక అవతారంలో దర్శనం ఇచ్చారు. బుధ వారం అమ్మవారు శ్రీ సరస్వతి దేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు నంబి మహేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామస్తులు ఉదయం అమ్మవారికి అభిషేకం,నైవేద్యం సమర్పించారు. అభిషేక పూజలో దంపతులు పాల్గొని అమ్మ వారిని వేడుకున్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ గావించారు. సాయంత్రం సుందరంగా అలంకరించిన పల్లకిలో అమ్మవారిని గ్రామంలోని విధిల నుండి డబ్బులతో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో దేవికి స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి వద్ద భజన కార్యక్రమం, కోలాటం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,భక్తులు పాల్గొన్నారు.




# రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి

- ప్రోటీన్ల ఆవిష్కరణలో విశేష సేవలకుగాను
- డేవిడ్ బేకర్, డెమిస్ హస్సాబిస్, జాన్ జంపర్ లకు నోబెల్

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

రసాయన శాస్త్రంలో ఈ ఏడాది నోబుల్ బహుమతి.. డేవిడ్ బేకర్, డెమిస్ హస్సాబిస్‌తో పాటు జాన్ జంపర్‌ను వరించింది. ప్రోటీన్ల ఆవిష్కరణలో అందించిన సేవలకుగాను వీరిని ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ మేరకు స్వీడన్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమి బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. యూఎస్ఏలో సీయాటెల్‌లోని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌కు చెందిన డేవిడ్ బేకర్.. ప్రోటీన్ గణన రూపకల్పన కోసం విశేష కృషి చేశారని వివరించింది. అలాగే లండన్‌కు చెందిన డెమిస్ హస్సాబిస్, జాన్ జంపర్‌లు ప్రోటీన్ నిర్మాణాన్ని అంచనా వేశారని పేర్కొంది. ఈ ఏడాది గుర్తించిన అద్భుతమైన ఆవిష్కరణల్లో ప్రోటీన్ల నిర్మాణం ఒకటని రసాయన శాస్త్రానికి సంబంధించిన నోబెల్ కమిటీ చైర్మన్ హీనర్ లింకే వెల్లడించారు. ప్రోటీన్ నిర్మాణాలను వాటి అమైనో ఆమ్ల శ్రేణుల నుంచి అంచనా వేయడం మరొకటని ఈ సందర్భంగా హీనర్ లింకే తెలిపారు. ఇది 50 ఏళ్ల నాటి కల అని గుర్తు చేశారు. ఈ రెండు ఆవిష్కరణలు విస్తారమైన అవకాశాలను కల్పిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన ప్రోటీన్లను రూపొందించడంలో డేవిడ్ బేకర్.. అసాధారణమైన ప్రతిభ కనబరిచారని వివరించారు. అలాగే దాదాపు ఐదు దశాబ్దాల నాటి సవాల్.. ప్రోటీన్ల సంక్లిష్ట త్రిమితీయ నిర్మాణాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా డెమిస్ హస్సాబిస్, జాన్ జంపర్‌లు అంచనా వేసి అభివృద్ధి పరిచారని పేర్కొన్నారు. ఇప్పటికే భౌతిక, వైద్య శాస్త్రాల్లో నోబెల్ విజేతలను స్వీడిష్ అకాడమీ ప్రకటించింది. ఈ ఏడాది భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి జాన్ హోప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్‌లను వరించింది. వీరిద్దరు కృత్రిమ నాడీ వ్యవస్థలతో మెషీన్ లెర్నింగ్‌ను సాధ్యం చేసేలా సిద్ధాంతపరమైన ఆవిష్కరణలకు రూపకల్పన చేశారు. దీంతో వీరిద్దరిని భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతికి ఎంపిక చేశారు.ఇక వైద్య శాస్త్రంలో అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలు విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రువ్‌కున్‌లకు నోబెల్ పురస్కారం దక్కింది. మైక్రో ఆర్ఎన్ఏ ఆవిష్కరణతోపాటు జన్యు నియంత్రణలో దాని పాత్రను వీరిద్దరు వివరించారు. ఈ నేపథ్యంలో వారిద్దరికి నోబెల్ పురస్కారాన్ని రాయల్ స్వీడిష్ అకాడమీ ప్రకటించింది. ఇక మరికొద్ది రోజుల్లో శాంతి, సాహిత్య విభాగాల్లో సైతం ఈ నోబెల్ పురస్కారాలను ప్రకటించనుంది. డిసెంబర్ 10వ తేదీన స్వీడన్ రాజధాని స్టాక్ హోమ్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో విజేతాలకు ఈ నోబెల్ పురస్కారాలను అందజేయనున్నారు.



# గంగా మాతకు హారతి పట్టి పూలమాల వేసిన యశస్విని రెడ్డి


**దేవరుప్పుల, విశాల భారతి** దేవరుప్పుల మండలం సింగరాజు పల్లి గ్రామం లోని చెరువు కెనాల్ కాల్వ ద్వారా నింపబడి, మత్తడి పోస్తున్న సందర్భంగా స్థానిక పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు హనుమాండ్ల యశస్విని ఝాన్సీ రెడ్డి సింగరాజు పల్లి చెరువు దగ్గర ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించి గంగా మాతకు హారతిపట్టి పూలను సమర్పించారు. అనంతరం బంజర గ్రామం మీదుగా వెళుతున్న కెనాల్ కాలువలో నీటిని పరిశీలించి నీటి ఫ్లోను పెంచాలని, మండలంలోని అన్ని గ్రామాల చెరువులను త్వరగా నింపాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నల్ల శ్రీరామ్, గ్రామ కమిటీ అధ్యక్షు లు కొండ మల్లారెడ్డి, ఊట్ల శివ, నల్ల యాదగిరి, జాటోత్ చంద్రయ్య, ఇప్ప పృథ్వీ రెడ్డి, తాళ్ల పెల్లి వేణు, నల్ల పవన్, కత్తుల సంపత్ రెడ్డి, అటిక్కెం ఎల్లయ్య, నర్సయ్య, చింతల శ్రీనివాస్, కొంగరి రాములు, నరేందర్ నాయక్, రామచంద్రు నాయక్, రెడ్డి రాజుల రమేష్, జిల్లా నాయకులు మండల నాయకులు యూత్ నాయకులు సోషల్ మీడియా కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# కొండాపూర్ టాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోమిరే శ్రీనివాస్ ఎన్నిక

- శ్రీనివాస్ ను అభినందించిన సబ్బని రమేష్



**చిగురుమామిడి, విశాల భారతి** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామంలో ట్రాక్టర్ యూనియన్ ఎన్నికలు గౌరవ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, రెడ్డి సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టాక్టర్స్ యూనియన్ అధ్యక్షుడిగా కోమిరే శ్రీనివాస్, ఉపాధ్యక్షునిగా ఎస్ కే కశిం, క్యాషియర్ గా గాజుల తిరుపతిలను ఎన్నుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఎంపిక కావడం పట్ల సబ్బాని రమేష్ అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ట్రాక్టర్ యూనియన్ సభ్యులకు శ్రీనివాస్ ధన్యవాదాలు తెలియజేశారు. ట్రాక్టర్స్ అసోసియేషన్ అభివృద్ధికి నిరంతర కృషి చేస్తానని శ్రీనివాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాక్టర్స్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# దైవచింతనను అలవర్చుకోవాలి

- గుర్రం కేశవులు

**ఆమనగల్లు,విశాల భారతి ::** ప్రతి ఒక్కరు దైవచింత అలవర్చుకోవాలని ఆమనగలు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కరుణశ్రీ కేశవులు దంపతులు కోరారు. హైదరాబాద్ లోని కర్మన్ గట్టు పద్మా నగర్ కాలనీలో శ్రీ దుర్గా భవాని దేవాలయాన్ని బుధవారం ఉదయం సందర్శించారు. దేవి నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించారు. దైవ ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదపడతాయని కేశవులు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాలలో కండే గోపాల్, బిక్కుమాండ్ల వెంకట్, తదితరులు పాల్గొన్నారు

# యూనివర్సిటీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి

- ఆరోగ్య శాఖ మంత్రికి తెలంగాణ అల్ యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్



**హైదరాబాద్, విశాలభారతి:** తెలంగాణలో ఉన్న అన్ని యూనివర్సిటీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ అల్ యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ సంఘం, ఉస్మానియా యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘాల నాయకులు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ్మను ఆయన చాంబర్లో కలిసి వినతిపత్రం ఇచ్చారు. దానికి మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తెలంగాణలో ఉన్న అన్ని యూనివర్సిటీస్ కి హెల్త్ కార్డు ఇచ్చేలా చూస్తా అని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో టౌట అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం మల్లేశం, ఉపాధ్యక్షులు డా. చలమల వెంకటేశ్వర్లు , ప్రొఫెసర్ సరస్వతమ్మ, ప్రొఫెసర్ మంగు, తెలంగాణ రాష్ట్ర వైశ్య విశ్వ విద్యాలయాల నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బి జ్ఞానేశ్వర్, నాగరాజు రావు , అశోక్ కుమార్, విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్
గురువారం, 10.10.2024
హైదరాబాద్




## ప్రజాభీష్టం మేరకే భారత్ ఖాదీ బండార్ షోరూం ఏర్పాటు

- కత్తుల రవి

**సూర్యాపేట, విశాల భారతి** వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను అందించడమే లక్ష్యంగా ఖాదీ బండార్ నూతన వస్త్ర షోరూంని ప్రారంభించినట్లు నిర్వాహకులు కత్తుల రవి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన భారత్ ఖాదీ బండార్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఫాస్టర్ బాబురావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులు రవి మాట్లాడుతూ ఖద్దరు వస్త్రాల వినియోగ దారులకు నాణ్యమైన వస్త్రాలను అందించడమే కాక సరసమైన ధరలకే కోరుకున్న వస్త్రాలు ఈ షోరూం లభించనున్నట్లు తెలిపారు. ఇచ్చట ఎమ్మెల్యే ఖాదీ,కాటన్ ఖాదీ,పొందూరు ఖద్దర్, మట్కా ఖద్దర్ లతో పాటు పలు రకాల ఖాదీ బండార్ వస్త్రాలు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. గత 20 ఏళ్లుగా వస్త్ర రంగంలో రాణిస్తూ వినియోగదారుల మన్ననలు పొందుతున్నామని, అదే మాదిరిగానే ఖాదీ బండార్ వస్త్ర ప్రపంచాన్ని కూడా ప్రజలు ఆదరిస్తారని ఆకాంక్షిస్తున్నారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కత్తుల అరుణ,జాన్ మార్క్, గాబ్రియేల్,మీసాల ప్రభుదాస్, ప్రేమ్ కుమార్,చింత జాన్ విల్సన్,పరశురామ్,అయోధ్య తదితరులు పాల్గొన్నారు.



## ఈ నెల 13న విశ్వబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక

**సూర్యాపేట, విశాల భారతి** ఈ నెల 13న జరిగే విశ్వబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదికను అందరు సద్వినియోగం చేసుకోవాలని విశ్వకర్మ ఫౌండేషన్ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అడ్లూరి రవీంద్రా చారి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 15నుండి 20సంవత్సరాలలో రెండు తెలుగు రాష్ట్రాలల్లో అనేక కుటుంబ వివాహ సమాచారాలను సేకరించి మన బంధువులకు అందించినట్లు ఆయన తెలిపారు. గత 4 సంవత్సరాలుగా లక్షా ముప్పై వేల కుటుంబ వివరాలను ఫోన్ ద్వారా సేకరించి అవసరం ఉన్నవారికి తెలియజేశామన్నారు. వీటితో సుమారుగా 20నుండి 25వేల సంబంధాలు కుదిరాయన్నారు. పైసా ఖర్చు లేకుండా బిజీగా ఉండే వారికి, తిరుగలేని పేద వారికోసం ఉచితంగా సూర్యాపేట జిల్లా కేంద్రం కిరాణం ఫ్యాన్సీ, మర్చంట్ అసోసియేషన్ భవనంలో ఈ నెల 13వ తేది ఉదయం 10.30 గంటలనుండి సాయంత్రం 4.30గంటల వరకు కేవలం విశ్వ బ్రాహ్మణ పంచకులస్తులకు మాత్రమే ఉచిత వివాహ పరిచయ వేదికను పట్టణ కుల పెద్దల సహకారంతో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇట్టి సదుపాయాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేయాలని, అలాగే అధిక సంఖ్యలో పాల్గొని వేదికను విజయవంతం చేయాలని ఆయన కోరారు. దాతల సహకారంతో పాల్గొన్నవారికి భోజన వసతి కూడా కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 9908514792ను సంప్రదించ వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ముదిమాణిక్యం వీర బ్రహ్మచారి, నాగవెల్లి బ్రహ్మయ్య, బాణాల శ్రీనివాస్, వీరండి సీతారామాచారి, సలేంద్రాచారి, పరిపూర్ణాచారి,రంగు దిలీప్ కుమార్, తంగెల్లపల్లి మధుకర్, కొండ గూడూరి లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.



## కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

- సరస్వతి మాత అలంకరణలో అమ్మవారి దర్శనం

**కల్వకుర్తి, విశాల భారతి** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. నిత్యం వాసవి అమ్మవారు భక్తులకు వివిధ రూపాల్లో దర్శనమిస్తున్నారు. ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ జూలూరు రమేష్ బాబు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ అధ్యక్షతన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారు సరస్వతీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ వేరు వేరుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ప్రత్యేక సామూహిక వడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి వడి బియ్యం పోయడం జరిగింది. అదే విధంగా చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే తో పాటు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎడ్మా సత్యం, వెంకటేశ్వర స్వామి దేవస్థానం కల్వకుర్తి చైర్మన్ కల్వ మనోహర్, తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు..ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు గంప శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి నారాయణరాజు, దాచేపల్లి నితిన్ కుమార్, కోశాధికారులు పానుగంటి నవీన్, సంబు తరుణ్, వాస మనీష్, ఉత్సవ కమిటీ ముఖ్య సలహాదారులు దాచేపల్లి శ్రీనివాసులు, సంబు ముత్యాలు, వాస శేఖర్, గంధం కిరణ్ ప్రసాద్, గందె రవి తదితరులు పాల్గొన్నారు.

## 2024 డీఎస్సీ చరిత్రలో నిలిచిపోతుంది

- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి

**నూతనకల్, విశాలభారతి:** ఉపాధ్యాయ నియామక ప్రక్రియ 2024 డీఎస్సీ ని అత్యంత పారదర్శకంగా నిర్వహించి కేవలం 3 నెలల్లోనే నియామక పత్రాలు అందించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి కే దక్కుతుందని నూతనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి అన్నారు. 2012 ముందు అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు తర్వాత సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ఉపాధ్యాయ నియామక ప్రక్రియను 4 నెలల్లో పూర్తి చేస్తే దాన్ని సవాలుగా తీసుకొని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం 3 నెలల్లోనే 2024 డిఎస్సీ ని నిర్వహించి నియామక పత్రాలు అందించడం గొప్ప విషయం అన్నారు. ఉద్యోగ నియామకాల్లో నిబద్ధతతో



పనిచేస్తున్నారని కొనియాడారు 2024 డీఎస్సీ ని సమర్థవంతంగా నిర్వహించి 11,000 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

## బిజెపి పార్టీ సభ్యత్వానికి అపూర్వ స్పందన

- స్థానిక ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరవేయడం లక్ష్యం
- వేముల నరేందర్ రావు

**వనపర్తి, విశాల భారతి::** ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో బిజెపి పార్టీ సభ్యత్వానికి అపూర్వ స్పందన వచ్చిందని రాష్ట్ర బిజెపి నాయకులు నరేందర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మీ కృష్ణ గార్డెన్స్ లో వనపర్తి అసెంబ్లీ సభ్యత్వ సమన్వయకర్త మున్నూరు రవీందర్ అధ్యక్షతన నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర నాయకులు, సభ్యత్వ నమోదు జిల్లా ఇన్చార్జి వేముల నరేందర్ రావు మాట్లాడుతూ ..దేశంలో ఏ ఇతర రాజకీయ పార్టీకి లేని కార్యకర్తల నిర్మాణాత్మక బలం బిజెపి సొంతమని కార్యకర్తల కృషి కారణం చేత గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ గోవా రాష్ట్రాల మాదిరి హర్యానాలో కూడా బిజెపి పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించిందని తెలంగాణ రాష్ట్రంలో గత పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి సాధించిన 77 లక్షల



45 వేల ఓట్లలో 75% మందిని బిజెపి సభ్యులుగా నమోదు చేయించి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ దుందుభి మోగించి 2029 ఎన్నికల్లో బీజేపీ అధికారం చేపట్టబోతుందని భీమా వ్యక్తం చేశారు. సభ్యత్వ నమోదు సమన్వయకర్త మున్నూరు రవీందర్, జిల్లా అధ్యక్షులు డి. నారాయణ మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతుందని అసెంబ్లీ నియోజకవర్గానికి రాష్ట్ర పార్టీ నిర్దేశించిన 35వేల సభ్యత్వాలలో 15000 సభ్యత్వం పూర్తి అయిందని ఈనెల 15 వరకు లక్ష్యం పూర్తి చేయాలని 6 గ్యారంటీల పేరుతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీలో హామీల అమలులో పూర్తిగా విఫలం చెందిందని ఈ నెల 15 వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తిచేసుకుని తదుపరి సంస్థ గత కమిటీల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యమ కార్యాచరణ తీసుకోవాల్సిన అవసరం ఉందని తద్వారా రాబోయే స్థానిక ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్బిరెడ్డి వెంకట్ రెడ్డి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ జిల్లా సభ్యత్వ కన్వీనర్ ఆర్.లోక్ నాథ్ రెడ్డి , ఓబిసి రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ , ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బి. శ్రీశైలం యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కదిరే మధు, జిల్లా ఉపాధ్యక్షుడు బండారు కుమారస్వామి ,గౌని హేమారెడ్డి, రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి, పి.విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బోయల రామ్మోహన్, జిల్లా అధికార ప్రతినిధి & మీడియా ఇన్చార్జ్ పెద్దిరాజు మహిళా మోర్చా మాజీ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి కల్పన మోర్చాల జిల్లా అధ్యక్షులు రాఘవేందర్ గౌడ్,రాజశేఖర్ గౌడ్,రవి నాయక్, ఎండీ.ఖాలీల్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సూగూరు లక్ష్మీ, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆడపిల్లను పుట్టనిద్దాం.. ఎదగనిద్దాం

- ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

**సూర్యాపేట, విశాల భారతి** ఆడపిల్లను పుట్టనిద్దాం.. పెరగనిద్దాం.. ఎదగనిద్దాం అనే నినాదంతో బుధవారం సూర్యాపేట పట్టణంలోని ఒకటవ వార్డు కు డకుడలో ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి మాట్లాడుతూ చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు అని వయసుతో సంబంధం లేకుండా లైంగిక దాడులు, అత్యాచారాలకు పాల్పడుతున్న మృగాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆడపిల్లల విషయంలో జోక్యం చేసుకోవాలంటే భయపడే విధంగా శిక్షలు ఉండాలన్నారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలని కోరారు. అప్పుడే దేశంలోనేరాలు, ఘోరాలు అదుపులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు పిండిగ నాగమణి, కోట సృజన, కొప్పుల రజిత, ఆవు దొడ్డి భాగ్యమ్మ,ఎల్గూరి లక్ష్మి,ఎల్లమ్మ, కవిత, పాల్గొన్నారు.



## రైతు చేతిలో ఆధార్ కార్డు తప్పనిసరి

- స్టాక్ బోర్డ్ మైంటైన్ చేయాలి
- బిల్లు లేకుండా రైతు ఎరువు, విత్తనాలు తీసుకోకూడదు

**మరిపెడ, విశాలభారతి:** ఫెర్టిలైజర్ పెస్టిసైడ్స్ హెడ్ సీడ్స్ యజమానిలు తప్పకుండా స్టార్ బోర్డ్ మైంటైన్ చేయాలని, బిల్ బిల్లు లేకుండా వ్యాపారం చేయడం చట్టరీత్యా నేరమని, జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల అన్నారు. బుధవారం భార్గవ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మరిపెడ డివిజన్ ఫెర్టిలైజర్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ యజమానియాల సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువుల కోసం వచ్చే రైతుల చేతిలోఆధార్ కార్డు తప్పనిసరి అని,ప్రతి యజమాని ఓ ఫామ్, పిసిలు మెయింటెనెన్స్ చేయాలి. లేనియెడల యాక్షన్ తీసుకోవడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మహబూబాబాద్ జిల్లా స్టాక్ రిజిస్టర్ మైంటైన్ చేయడంలో వెనుక ఉన్నామని, షాపులలో బ్లాక్ బోర్డ్ మైంటైన్ చేసి ఉన్న స్టాక్ ని అందులో పొందుపరచాలన్నారు. ప్రతి వ్యాపారి బాధ్యతగా వ్యాపారం చేయాలి యాక్ట్ పరిధిలో మాత్రమే పని చేయాలన్నారు. ఏ ఒక్క రైతుకి బిల్ బుక్ లేకుండా మందులు అమ్మడం చట్టరీత్యా నేరం అవుతుందని అన్నారు. అధికారులు ప్రతివారం ఫైల్స్ తనిఖీకి రావడం జరుగుతుంది ఈ తనిఖీలో భాగంగా ప్రతి షాప్ యజమాని అందుబాటులో ఉండి అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మరిపెడ డివిజన్ ఏడిఏ విజయ్ చంద్ర, మరిపెడ ఫెర్టిలైజర్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ అధ్యక్షులు కాలం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఉప్పల కృష్ణ జనరల్ సెక్రెటరీ హరీష్, అధికారి సురేందర్, జాయింట్ సెక్రెటరీ ప్రసాద్,కార్యవర్గ సభ్యులు అంబరీష రవీందర్ రెడ్డి,రంగయ్య,ఏడు మండలాల ఏవో అధికారులు, డివిజన్లో ఉన్న షాప్ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.



## సూపర్ 8కు చేరుకున్న బయ్యారం పోలీస్ టీం

- మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్న ఎస్సై రాజ్ కుమార్

**పినపాక, విశాలభారతి:** గోపాలరావుపేట గ్రామంలో జరుగుతున్న దసరా మెగా క్రికెట్ టోర్నమెంట్ 2లో బుధవారం రెండవ స్టేజ్ మ్యాచ్లో ఏడూళ్ల బయ్యారం పోలీస్ టీం రంగాపూర్ టీం మధ్య పోటి జరిగింది. ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన ఏడూళ్ల బయ్యారం పోలీస్ వారు ఓపెనర్ గా వచ్చిన సత్తిపండు 30 పరుగులతో మంచి ఆరంబాన్ని ఇచ్చారు. దింతో నిర్ణీత 8 ఓవర్లలో 63పరుగులు సాధించారు. 64 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ దిగిన రంగాపూర్ టీం కు పవర్ ప్లే లో రెండు ఓవర్ల బౌలింగ్ చేసిన ఎస్సై రాజ్ కుమార్ బంతికి పని చెప్పడంతో ముఖ్యమైన రెండు వికెట్స్ రంగాపురం వారు కోల్పోయారు. దింతో ఆ టీం కు కోలుకోలేని దెబ్బ తగిలింది. చివరి వరకు పోరాడి పరాజయం పాలైన రంగాపురం టీం ప్రేక్షకుల మనసులను గెలిచారు. తొలి రెండు వికెట్స్ తీసిన బయ్యారం పోలీస్ టీం రథ సారథి ఎస్సై రాజ్ కుమార్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును పినపాక సీనియర్ పాత్రికేయులు బిల్లా నాగేంద్ర బాబు, గ్రామస్తులు బొలిశెట్టి ప్రభాకర్ చేతులమీదుగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై రాజ్ కుమార్ మాట్లాడుతూ క్రీడలను వీక్షించడానికి వచ్చిన క్రీడాకారులకు అభిమానులకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యుత్ కి అడ్డంగా హరితహారం మొక్కలు

**నరసింహులపేట, విశాలభారతి:** మండలంలోని గ్రామ పంచాయతీలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం మొక్కలకు ముందుచూపు లేకుండా అధికారుల నిర్లక్ష్యంతో మొక్కలు నాటారు. ఇప్పుడున్న పరిస్థితులలో విద్యుత్ అంతరాయానికి పెద్ద సమస్యగా ఏర్పడింది వీటిని దృష్టిలో పెట్టుకొని ఇకనైనా అధికారులు ముందు చూపుతో నడవాలని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.



## సరస్వతి అవతారంలో అమ్మవారు

**పాలకీడు, విశాలభారతి:** మండల కేంద్రంలో దేవి నవ రాత్రులలో భాగంగా ఏడవ రోజు బుధవారం ఎంతో విశిష్టమైన అమ్మవారి జన్మతిథి మూలా నక్షత్రంలో అమ్మవారు సరస్వతి దేవి గా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని సరస్వతి అవతారంలో అలంకరించి కుంకుమ పూజలు,అభిషేకాలు అన్నదానాలు జరిపి భక్తులు పలకలు,పెన్నులు,పుస్తకాలు అమ్మవారి దగ్గర ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చదువులతల్లి సరస్వతి అవతారంలో అమ్మవారి సమక్షంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి మంచి బుద్ధి,జ్ఞానం,ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు కలిగించాలని అమ్మవారిని వేడుకున్నారు





## అన్నదానం మహాదానం

**సూర్యాపేట, విశాల భారతి** అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మహాదానమని, దుర్గామాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఎన్నారై చలసాని రాజీవ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోల నాగరాజు అన్నారు. సూర్యాపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, అన్నదానం దాత కోల నాగరాజు అరుణ దంపతుల ఆధ్వర్యంలో 25 వార్డులోని చంద్రన్న కుంట, ముత్యాలమ్మ బజార్ నందు ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద 15వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం అన్నదాన ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ శానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, దుర్గామాత నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు మోర నరేష్,నజీమ్,రామకృష్ణ, రాహుల్,నాగరాజు,ఇ సాయి, కే సాయి, ఎస్ సాయి, కె, అరవింద్,శ్రీకాంత్, తిరుమల్, తదితరులు పాల్గొన్నారు.



## ఎంబీబీఎస్ సీట్ సాధించిన విద్యార్థినికి ఎమ్మెల్యే అభినందనలు

**బాల్కొండ, విశాల భారతి** ఎంబీబీఎస్ లో సీట్ సాధించిన విద్యార్థిని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అభినందించారు. ఎర్గట్ల మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ జక్కని సంధ్య మధుసూదన్ కుమార్తె జక్కని శ్రీవర్శిని వరంగల్ ప్రతిమ రికవరీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా మాజి మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి శ్రీవర్శినిని అభినందించారు. భవిష్యత్తులో మంచిగా చదివి మంచి డాక్టర్ గా పేద ప్రజలకు సేవలు అందించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

## బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

**ఆమనగల్లు, విశాల భారతి :** కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీ ఏర్పాటును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి చేపట్టిన పాదయాత్రకు మద్దతుగా బయలుదేరిన అమనగల్లు మున్సిపాలిటీలో బి ఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆమనగల్లు మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పత్య నాయక్ మాట్లాడుతూ ఫార్మా కంపెనీ పేరుతో చేసే రియల్ ఎస్టేట్ దందాను కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి ఎన్ని పిరికిపంద చర్యలకు పాల్పడినా, రేవంత్ కుట్రలను ఎత్తి చూపుతానే ఉంటాం అని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమం



లో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి ,బిఆర్ఎస్ ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యదర్శి వడ్డేమోని శివకుమార్,సోషల్ మీడియా కన్వీనర్ గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య లోపం.. వీధి దీపాలు లేక ప్రజల ఇక్కట్లు



**డోర్నకల్, విశాలభారతి:** వెంకంపాహాడ్ గ్రామంలో పారిశుద్ధ్య లోపం, వీధి దీపాల కొరత తీవ్రంగా ఉందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది. గ్రామంలో దాదాపు మూడు నెలలుగా వీధి దీపాలు లేకపోవడంతో రాత్రిళ్లు ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. పాములు, తేళ్లు వంటి ప్రమాదకర జీవుల బెడదతో పాటు, చీకట్లో దొంగల బెడద కూడా పెరిగిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇక పారిశుద్ధ్యం విషయానికొస్తే, గ్రామంలో చెత్తను సక్రమంగా తొలగించకపోవడంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. మురుగు కాలువలు పూడిక తీయకపోవడంతో మురుగునీరు రోడ్లపై నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. గ్రామంలో టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.గ్రామ పంచాయతీ అధికారులు ఈ సమస్యలను పట్టించుకోవడం లేదని, ప్రజల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. స్పెషల్ ఆఫీసర్ నియామకం తర్వాత కూడా పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేదని వారు వాపోతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మాదిగలకు సీఎం రేవంత్ రెడ్డి ద్రోహం చేస్తున్నారు

- **ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ మాదిగ**



**వనపర్తి, విశాల భారతి:** జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌక్ నుండి కలెక్టర్ కార్యాలయంలో నిరసన కార్యక్రమాలు చేపట్టిన ఎమ్మార్పీఎస్ కొమ్ము చెన్నకేశవులు మాదిగ ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కొళ్ళ శివ మాదిగ మాట్లాడుతూ.. పై విషయమై ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో మూడు దశాబ్దాలుగా రాజీలేని పోరాటం చేస్తున్నాం అన్నారు. మొన్న ఆగష్టు 1 వ తేదీన సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ వర్గీకరణను అమలు చేసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని చారిత్రాత్మక తీర్పును ఇచ్చింది. ఈ తీర్పు ద్వారా ముప్పై ఏళ్ల పోరాటానికి న్యాయమైన పరిష్కారం లభించింది అని అన్నారు. అయితే ఈ తీర్పు వచ్చిన అర్థ గంటలోనే అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం, దేశంలో వర్గీకరణను అమలు చేసే తొలి రాష్ట్రంగా తెలంగాణ ఉంటుంది.. ఇప్పటికీ ఇచ్చిన ప్రతి నోటిఫికేషన్ లో ఎస్సీ వర్గీకరణ అమలు జరిగేలా చూస్తాం అందుకు అవసరమైతే ఆర్డినెన్సు తీసుకువస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటికే రెండు నెలలు గడిచినా ఎస్సీ వర్గీకరణను అమలులోకి తీసుకురాలేదు. సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన తరువాత కూడా గత రెండు నెలలుగా విద్యారంగానికి సంబంధించి జరిగిన అన్ని కోర్సుల అడ్మిషన్లలో మాదిగ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగింది. అలాగే మరో వైపు ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను మరచిపోయి డీఎస్సీ ద్వారా 11062 ఉద్యోగాలను భర్తీ చేస్తూ మాదిగలకు ఘోరమైన అన్యాయం చేస్తున్నారు అని అన్నారు. ఎంతో కాలం ఎస్సీ వర్గీకరణ కోసం వేచి చూసి, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలులోకి తీసుకువస్తారని నమ్మకంతో ఈ డీఎస్సీ ఉద్యోగాల మీద ఎంతో ఆశ పెట్టుకొని ఎదురుచూసిన మాదిగ నిరుద్యోగులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా మోసం చేయడం జరిగింది అని అన్నారు. ఎస్సీ వర్గీకరణ లేకుండా భర్తీ అవుతున్న 11 వేల టీచర్ నియామకాల్లో మాదిగలకు భారీ నష్టం జరుగుతున్నది అని అన్నారు. నిరసన ప్రదర్శన అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏవోకి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గంధం గట్టయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమన్వయకర్త గంధం లక్ష్మయ్య మాదిగ, ఎం ఎస్ పి రాష్ట్ర నాయకులుఅజ్జపాగ లక్ష్మణ్ మాదిగ, ఎం ఎస్ పి వనపర్తి జిల్లా కన్వీనర్ గద్వాల కృష్ణ మాదిగ, ఎం ఈ ఎఫ్ నాయకులు బలరాం మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులుగట్టు స్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, కొమ్ము చెన్నయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు శేఖర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



## మంగయ్య మృతి సిపిఎం పార్టీకి తీరనిలోటు

- **సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి**

**సూర్యాపేట, విశాల భారతి** సిపిఎం సీనియర్ నాయకులు చెరుకుపల్లి మంగయ్య మృతి సిపిఎం పార్టీకి తీరని లోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు పిల్లలమర్రి గ్రామానికి చెందిన చెరుకుపల్లి మంగయ్య(78) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహంపై ఎర్ర జెండా కప్పి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ పిల్లలమర్రి గ్రామంలో నిర్వహించిన అనేక ప్రజా ఉద్యమాలలో చెరుకుపల్లి మంగయ్య పాల్గొన్నారని అన్నారు. అనేక ఇబ్బందులు వచ్చినప్పటికీ వాటికి భయపడకుండా ధైర్యంగా నిలబడి అనేక కష్టాలను ఎదుర్కొన్నారని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులుగా పనిచేస్తూ గ్రామంలో అనేక కూలీ పోరాటాలు చేశారని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పిల్లలమర్రి గ్రామంలో నిర్వహించిన భూ పోరాటంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం నేటి యువత కంకన బదులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, సిపిఎం పార్టీ త్రీ టౌన్ కార్యదర్శి మేకన బోయిన శేఖర్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు మేకన బోయిన సైదమ్మ, సిపిఎం సీనియర్ నాయకులుచెరుకు సత్యం, పిల్లలమర్రి గ్రామ పార్టీ నాయకులు తీగల లింగయ్య, చింతలచెరువు పద్మ, తీగల ఎల్లమ్మ మంగయ్య కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ రంగంలో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి

- **బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయ నాయుడు**



**పాలకీడు, విశాలభారతి:** ప్రైవేట్ రంగంలో కూడా బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు కోరారు. బీసీ హక్కుల సాధన సమితి సూర్యాపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాదే నరసయ్య, పాలక వీడు మండల సిపిఐ కార్యదర్శి ముల్ల జానయ్యతో కలిసి ఆయన పాలక వీడు మండల కేంద్రంలో పాత్రికేయులతో మాట్లాడుతూ భారత రాజ్యాంగం, ఈ దేశంలోని ప్రజలందరికీ జాతి, కుల, వర్గ, లింగ వివక్షత లేకుండా సమానత్వాన్ని సమాన అవకాశాలను కల్పిస్తానని హామీ ఇచ్చిందని సగానికి పైగా ఉన్న బీసీల జీవన ప్రమాణాలు పెరగకుండా దేశ అభివృద్ధి జరగడం ఎన్నటికీ సాధ్యం కాదు అని అన్నారు. అందువల్ల సామాజిక న్యాయం సమగ్ర అభివృద్ధి జరగాలంటే అన్ని రంగాలలో సంపదంతా వికేంద్రీకరణ జరగాలి అని అందులో భాగంగా ఈ దేశంలో జంతు గణనతో పాటు కులగల చేపట్టాలని జనాభాలో దామాషా ప్రకారం బడ్జెట్ తో పాటు విద్య ఉద్యోగ అవకాశాలు కేటాయించాలని అన్నారు. దేశవ్యాప్తంగా బీసీలు అనేక రూపాల్లో ఉద్యమిస్తున్నారని బీసీల ఉద్యమం తీవ్ర రూపం దాల్చకముందే జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీ కుల గణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



## కోర్టు ఆవరణలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**కల్వకుర్తి, విశాల భారతి** దసరా పండుగను పురస్కరించుకొని బుధవారం కల్వకుర్తి కోర్టులో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రకరకాల పూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ ఆటలాడుతూ ఆనందోత్సవాల మధ్య బతుకమ్మ ఆడారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, జూనియర్ సివిల్ జడ్జి కావ్యలు బతుకమ్మ ఎత్తుకొని భక్తి శ్రద్ధలతో సాంప్రదాయ బద్ధంగా బతుకమ్మ ఆటలో పాల్గొన్నారు. సీనియర్, జూనియర్ కోర్టు మహిళా సిబ్బంది డ్రెస్ కోడ్ తో బతుకమ్మలను నెత్తిపై పెట్టుకుని కోర్టు ముందు ఆడడంతో పండుగ వాతావరణం నెలకొంది. కోర్టు సిబ్బంది నిర్వహించిన ఈ కార్యక్రమంలో కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరమణ, సీనియర్ కోర్టు సూపర్డెంట్ ఆనంద్, చంద్రశేఖర్ అనిల్ కుమార్ జూనియర్ సివిల్ కోర్టు సూపర్డెంట్ కోట్ర సత్యం, ఆనంద్, రాజేంద్రప్రసాద్, స్వామి గౌడ్ మహిళా సిబ్బంది పార్వతమ్మ, పారిజాత, మాధవి పి శ్రీలత, వి శ్రీలత అలివేలు కే శ్రీలత సంధ్య దేవి వీరితోపాటు కార్యక్రమంలో న్యాయవాదులు భాస్కర్ రెడ్డి ప్రశాంత్ శ్రీను నాగరాజు మల్లేష్ పి మల్లేష్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## దుర్గామాతను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

**ఆమనగల్లు, విశాల భారతి** తలకొండపల్లి మండలం మాదాయపల్లి గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు చెప్పారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, రెహమాన్,విజయ్ కుమార్ రెడ్డి, జోగు వీరయ్య, జయమ్మ పాల్గొన్నారు.



## పిల్లలకు నోట్ బుక్స్, పెన్నుల పంపిణీ

**నేరేడుచర్ల, విశాలభారతి:** మున్సిపాలిటీ పరిధిలోని నర్సయ్యగూడెం లో కనక దుర్గ అమ్మవారి నవరాత్రుల్లో భాగంగా ఏడవరోజు బుదవారం అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచారు. పూజా కార్యక్రమము అనంతరము కమిటీ సభ్యుడు కొప్పు లక్ష్మినారాయణ పిల్లలకు నోట్ బుక్స్,పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అలక సైదిరెడ్డి,కంపసాటి అంజయ్య,అలక శ్రవణ్ రెడ్డి, మల్గిరెడ్డి మల్లారెడ్డి,మల్గిరెడ్డి సైదిరెడ్డి,ప్రభాకర్ రెడ్డి,కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పిల్లలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## కోర్టు ఉద్యోగుల సంఘం బతుకమ్మ సంబరాలు

**ఆమనగల్లు, విశాలభారతి :** ఆమనగల్ పట్టణంలోని జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో బతుకమ్మ సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. జ్యుడీషియల్ కోర్టు ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బతుకమ్మ సంబరాలలో రంగు రంగుల పూలను బతుకమ్మలుగా అలంకరించి కోర్టు ఆవరణలో ఏర్పాటు చేశారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బతుకమ్మలతో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపల్లి జగన్, ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, సీనియర్ న్యాయవాదులు అండేకార్ యాదిలాల్, కోర్టు సూపరిండెంట్ మురళికృష్ణ, రంగారెడ్డి జిల్లా కోర్టు ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రామకృష్ణ, శేఖర్, విజయ్, సంతోష్, గణేష్, మల్లేష్, కొప్పు కృష్ణ, బిక్కినాయక్, దేవేందర్, శ్రీనివాస్, పోలీసులు, కోర్టు సిబ్బంది తదితరులున్నారు.



## తహసిల్దార్ ని కలిసిన గిరిజన సంఘం నాయకులు

**పినపాక, విశాలభారతి:** మండలంలో నూతన తహశీల్దార్ గా బాధ్యతలు చేపట్టిన అద్దంకి నరేష్ ని జాతీయ ఆదివాసి అభ్యుదయ నాయకుడు గొగ్గోలు ఆర్కే దొర బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గొగ్గోలు ఆర్ కె దొర మాట్లాడుతూ ఆదివాసి ప్రాంతాలలో 1/70 చట్టాన్ని ధిక్కరిస్తే ఆదివాసి హక్కులను, చట్టాలకు తీవ్రమయిన ఇబ్బంది ఆదివాసీలు పడుతున్నారని ఆయన అన్నారు. రైతుల సమస్యలు పరిష్కారమయ్యేట్లు సామాన్యుడికి సైతం రెవెన్యూ సేవలు అందుబాటులో ఉండేలా చట్టబద్ధంగా పనులు చేస్తామని పినపాక తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీ ఆదివాసి అభ్యుదయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్సం సారయ్య, పినపాక మండలం ప్రధాన కార్యదర్శి ధనసరి నరసింహమూర్తి, (అడ్వకేట్) ఖాయం సర్వేశ్వరరావు, సీనియర్ నాయకులు, బడిగ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**మరిపెడ, విశాలభారతి:** స్థానిక పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు స్టేషన్ రికార్డులను, పరిసరాలను తనిఖీ చేశారు. 5యస్ ఇంప్లిమెంటేషన్ విధానాన్ని పరిశీలించారు. యస్.హెచ్.ఒ, సిబ్బందితో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి సస్పెక్ట్, హిస్టరీ షీటర్ ల కదలికలను చెక్ చేయాలని, యాక్టివ్ గా ఉన్నటువంటి వారందరూ ఎలాంటి కార్యకలాపాలు చేస్తున్నారో చెక్ చేయాలన్నారు. అలవాటుపడిన నేరస్తుల షీట్ ఓపెనింగ్ కోసం ప్రపోజల్స్ పంపాలని ఎస్.హెచ్.ఓ కు సూచించారు.దీర్ఘ కాలంగా పెండింగ్లో ఉన్న ఎన్.బి.డబ్ల్యు లు త్వరగా ఎగ్జిక్యూట్ అయ్యే విధంగా ప్రత్యేక టీం ఏర్పాటు చేసి ఎగ్జిక్యూట్ అయ్యే విధంగా చూడాలని సూచించారు. సిబ్బంది ప్రతి ఒక్కరు తమకు కేటాయించిన విధులను బాధ్యతయుతంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో మరిపెడ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, మరిపెడ ఎస్ఐలు సతీష్ , సంతోష్, తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## ప్రతి ఒక్కరు మధుమేహ పరీక్షలు చేసుకోవాలి

- **లయన్స్ క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి**

**కల్వకుర్తి విశాల భారతి** ప్రతి ఒక్కరూ కచ్చితంగా మధుమోహ షుగర్ పరీక్షలు చేయించుకోవాలని లైన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ పసుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. కల్వకుర్తిలోని లయన్ డయాగ్నెటిక్ సెంటర్లో ల్యాబ్ టెక్నీషియన్ లయన్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్న మధుమోహ షుగర్ కేంద్రాన్ని క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి బుధవారం ప్రారంభించారు. క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా మధుమేహ పరీక్షలు నిర్వహించి ఎనలేని సేవలు అందిస్తున్న క్లబ్ సభ్యులు లయన్ టెక్నీషియన్ క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి, క్లబ్ బృందం ఆయనను ఘనంగా సత్కరించారు. పరీక్షలు నిర్వహించిన వారికి రిపోర్ట్ పత్రాలను పరీక్షల నిర్ధారణ చేసిన వారికి అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లుకు ఎనలేని సేవలందిస్తున్న క్లబ్ సభ్యులు ల్యాబ్ టెక్నీషియన్ లయన్ సంపత్ కుమార్ ని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి, కార్యదర్శి మహేష్, కోశాధికారి గుజ్జరి నరసింహ, లయన్స్ క్లబ్ పి ఆర్ ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

## సోమారంలో తాగునీటి సమస్య

- **పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి రాజీవ్.**
- **నెలలో ఒక్కరోజు రాని స్పెషల్ ఆఫీసర్ ప్రేమ్ సాగర్.**



**సైదాపూర్,విశాలభారతి:** మండలంలోని సోమారం పంచాయితీ కేంద్రంలో ప్రభుత్వం ద్వారా ప్రజలకు మంచినీరు అందించే మినరల్ వాటర్ ప్లాంట్ ప్రస్తుతం తీయడం లేదు. దీంతో ప్రజలు నెల రోజులుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్లాంట్ ను పంచాయితీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. విద్యుత బిల్లు అధి కంగా వస్తుండడం వలన మినరల్ వాటర్ ప్లాంటును నిలిపివేసినట్లు తెలుస్తోంది. పంచాయతీ కార్యదర్శి రాజీవ్ దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లగా నిమ్మకు నీరు ఎత్తనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి వెంటనే నిత్యం మినరల్ వాటర్ను అందించాని ప్రజలు కోరుతున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో స్పెషల్ ఆఫీసర్ ప్రేమ్ సాగర్ నెలకు ఒక్కరోజైనా గ్రామాన్ని సందర్శించలేదు. దీనిపై మా విశాల భారతి విలేఖరి పంచాయితీ కార్యదర్శి రాజీవు ను సంప్రదించగా అందుబాటులో లేరు.



## దుర్గాదేవికి పల్లకి సేవా, సామూహిక కుంకుమార్చన

**ధర్పల్లి, విశాల భారతి:** ధర్పల్లి మండల కేంద్రంలోని బ్రదర్స్ యూత్ ఆధ్వర్యంలో శనివారం దుర్గామాతకు పంచామృత అభిషేకం, ఆదివారం ఘనంగా దుర్గాదేవి పల్లకి సేవ, సోమవారం బతుకమ్మ సంబరాలు, మంగళవారం మహిళలచే సామూహిక కుంకుమార్చన, బుధవారం యజ్ఞం హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా దుర్గాదేవికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన,హోమం నిర్వహించామని యూత్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సనుగుల వినయ్,ప్రణయ్, దువ్వ రాజు, సృజన్, హనుమాన్లు, చింటూ, అజయ్, దాసరి శ్రీపద్, నందు, నితిన్,కృష్ణ, శ్రీరామ్, శశిధర్, కన్నా,మణిదీప్, మణికంఠ, దీక్షిత్, వరుణ్, నీరజ్, మధు, వరుణ్ ఆదిత్య, హర్ష, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



**ఆమనగల్లు, విశాల భారతి :** ఆమనగల్లు పట్టణంలోని మార్కండేయ ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాత బుధవారం సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎంగలి బాలకృష్ణ అప్పం శ్రీను, ఎంగలి రమేష్ ఎంగలి యాదగిరి రాఘవేందర్ తిరుపతయ్య బోడలింగం సోమశంకర్ చంద్రమౌళి శ్రీధర్ నిరంజన్ చిలుకూరి అంజనేయులు ఎంగలి ప్రసాద్, మహిళా సభ్యులు అలివేలు, లత శ్రీ, ఉదయశ్రీ , ఎంగిలి రమ్యశ్రీ సుజాత లీలావతి పద్మ నీరజ తదితరులు పాల్గొన్నారు



## సకాలంలో మెడికల్ కళాశాల పనులు పూర్తి చేయాలి

- అధికారులకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**ఇబ్రహీంపట్నం మండలంలోని మంగళ్ పల్లిలో ఏర్పాటు చేస్తున్న మహేశ్వరం మెడికల్ కళాశాల పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీలో జరగాల్సిన పనులు, అందుబాటులోకి తీసుకురావాల్సిన పరికరాలు, కాలేజీ వసతుల ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మెడికల్ కాలేజీ పనులు నిర్వహిస్తున్న సమయంలో సివిల్ పనులు, సిబ్బంది నియామకం, ల్యాబ్ లు, హాస్టల్ వసతులు తదితర సంబంధిత పనులు అన్ని సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.





## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- బొల్లారంలో బతుకమ్మ ఘాట్ ప్రారంభం

**పటాన్ చెరు(బొల్లారం),విశాలభారతి:** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో 77 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన బతుకమ్మ ఘాట్, హై మాస్ట్ లైట్లను బుధవారం ఉదయం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఘాట్ ఆవరణలో జమ్మి చెట్టు మొక్కను ఆయన నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రపంచంలోనే ప్రకృతిని పూజించే పండుగ బతుకమ్మ పండుగ అన్నారు. బొల్లారం మున్సిపల్ ప్రజల కోసం అన్ని వసతులతో బతుకమ్మ ఘాట్ నిర్మించడం ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లారం మున్సిపల్ చైర్పర్సన్ రోజా బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ అనిల్ రెడ్డి, సీనియర్ నాయకులు, కౌన్సిలర్ చంద్రారెడ్డి, హనుమంత్ రెడ్డి, వరప్రసాద్ రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కనకదుర్గ అమ్మవారి పూజలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**ఎల్బీనగర్,విశాలభారతి:**వనస్థలిపురం ప్రశాంత్ నగర్ శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా బుధవారం నాడు అమ్మవారి దేవాలయంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాలు,సినిమా ఆటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కోమట్ రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు మల్ రెడ్డి రాంరెడ్డి,చల్లా నరసింహ రెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, మర్రి నిరంజన్ రెడ్డి ,కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్ రెడ్డి,రాగుల వెంకటేశ్వర రెడ్డి,ఆలయ కమిటీ చైర్మన్ శ్రీ సంరెడ్డి భుజంగ రెడ్డి, యుగేందర్ రెడ్డి పద్మా రెడ్డి పాల్గొన్నారు.



## ఆదర్శనగర్ లో దుర్గాభవాని వేడుకలు

- పూజలు నిర్వహించిన బీఆర్ఎస్ నేత గజ్జెల నగేష్

**విశాలభారతి,కంటోన్మెంట్:**దేవీనవరాత్రి సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎనిమదో వార్డ్ , ఆదర్శనగర్లో ఏర్పాటు చేసిన దుర్గాభవాని మండపాన్ని నిర్వాహకులు ఆహ్వానం మేరకు TSBCL మాజీ చైర్మన్ గజ్జెలనగేష్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రావుల సతీష్, సన్ని, రాహుల్, శ్యాం, దుర్గా భవాని మండప నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## మాత నిమిషాంభిక ఆలయంలో ప్రత్యేక పూజలు

- కార్పొరేటర్ పద్మారెడ్డి -ఉషారాణి దంపతులు

**బోడుప్పల్, విశాలభారతి:**దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని ఏడవ రోజున అమ్మవారి శ్రీ సరస్వతి దేవి అలంకరణలో ఉన్న మాత నిమిషాంభిక ఆలయంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి ఉషారాణి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్పొరేటర్ దంపతులకు ఆశీర్వాదములు అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి అశిస్సులు అందరికీ ఉండాలని కోరుకున్నారు.





## పట్నం మహేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన బండి రమేష్,శేరి సతీష్ రెడ్డి

**కూకట్ పల్లి,విశాలభారతి:**శాసనమండలి చీఫ్ విప్గ పదవీ బాధ్యతలు స్వీకరించిన పట్నం మహేందర్ రెడ్డిని కలిసి పుష్పగుచ్చమిచ్చి శుభాకాంక్షలు తెలిపిన కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్,కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న పట్నం మహేందర్ రెడ్డి కి శాసనమండలి చీఫ్ విప్ గా పదవి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రవీణ్, అరవింద్ రెడ్డి, ఫణికుమార్, మణి తదితరులు పాల్గొన్నారు.



## అన్ని రంగాల్లో పటాన్ చెరు అభివృద్ధి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రూ. 4 కోట్ల 77 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**పటాన్ చెరు,విశాలభారతి** శరవేగంగా విస్తరిస్తున్న పటాన్ చెరు డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి కి ప్రతీకగా నిలుపుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎస్సీ స్మశాన వాటిక, మున్నూరు కాపు ఫంక్షన్ హాల్, అంబేద్కర్ కాలనీ, గౌతమ్ నగర్ కాలనీలలో నాలుగు కోట్ల 77 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డివిజన్ పరిధిలో శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం పెరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహా రెడ్డి, సీనియర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- పాల్గొన్న మహిళా కార్పొరేటర్లు,ఉద్యోగులు.

**మేడిపల్లి,విశాలభారతి:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు కార్పొరేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో మేయర్ అమర్ సింగ్,కమిషనర్ త్రిల్లేశ్వర్ రావు,కార్పొరేటర్లు పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి,కుర్ర శాలిని శ్రీకాంత్ గౌడ్,మహిళా ఉద్యోగులు, ఎస్ హెచ్ జి మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ ఆడుతూ పాటలు పాడారు.పాటలకు లయ బద్ధంగా చప్పట్లు కొడుతూ కోలాటం ఆడారు.



## దేవి మాత అనుగ్రహం ప్రజలపై వుండాలి

- ఉప్పల శ్రీనివాస్ గుప్తా

**ఎల్బీనగర్ ,విశాలభారతి:**శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గ దేవి అమ్మవారు పూజ కార్యక్రమంలో TPCC ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొని అమ్మవారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు .ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ శ్రీ దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారి ఆశీస్సులు అందరి మీద వుండాలి అని ఆయన అన్నారు."జగన్మాత మహాలక్ష్మీ స్వరూపంలో దుష్ట రాక్షస సంహారిన్ని, లోకస్థితికారిణిగా ధన, ధాన్య , ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య , సంతాన, గజలక్ష్ములుగా వరాలు ప్రసాదించే తల్లి చల్లని దీవెనలు కలిగి ఉండాలనీ ఆయన అన్నారు .ఈ కార్యక్రమంలో నరేష్ గుప్త, శ్రీధర్ గుప్త , ఉత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీసాయి నగర్ కాలనీలో దేవి నవరాత్రి ఉత్సవాలు

- కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి కవిత దంపతులు
- పూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.
- శ్రీ మత సేవ ఉత్సవ కమిటీ సభ్యులు గజమాలతో కార్పొరేటర్ దంపతులను ఘనంగా సన్మానం

**మేడిపల్లి,విశాలభారతి:**దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 25వ డివిజన్ లోని శ్రీ సాయి నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ యందు ప్రతిష్ఠించిన దుర్గాదేవి అమ్మవారు ఆరవ రోజు శ్రీ మహాలక్ష్మి దేవి అలంకరణ అమ్మవారి పూజలో 25వ డివిజన్ కార్పొరేటర్ దంపతులు దొంతిరి హరిశంకర్ రెడ్డి కవిత అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు, కుంకుమ అర్చన కార్యక్రమంలో పాల్గొన్న మహిళ భక్తులు అందరికి తాంబూలం అందించిన కవిత హరిశంకర్ రెడ్డి . పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జక్క వెంకట్ రెడ్డి పాల్గొని, 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమన్ని ప్రారంభించారు. పూజ కార్యక్రమంలో నాయకులు,25వ డివిజన్ కాలనీ ల అధ్యక్షకార్యదర్శులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, పెద్దలు,అందరూ పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## దుర్గామాతకు కార్పొరేటర్ సింధు పూజలు

**పటాన్ చెరు,విశాలభారతి:**దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజి కాలనీ, మ్యాక్ సొసైటీ, ఓల్డ్ ఎంఐజి శీర్కి ఆఫీసులో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలను కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి దర్శించుకున్నారు. దుర్గామాతకు పూజలు నిర్వహించి, అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొన్నారు. అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వందన పూరీ కాలనీలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు

## నిరుపేద కుటుంబానికి ఎన్ఎస్యుఐ ఆర్థిక సహాయం

**బాల్కొండ, విశాల భారతి** నిరుపేద కుటుంబానికి ఎన్ఎస్యుఐ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. భీమ్‌గల్ పట్టణానికి చెందిన ఫాహీం కుటుంబం గత కొన్ని సంవత్సరాల నుండి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని నిజామాబాద్ జిల్లా ఎన్ఎస్యుఐ ఉపాధ్యక్షుడు సయ్యద్ రెహమాన్, బొజ్జ రాజు, పుప్పాల విశాల్ ద్వారా తెలుసుకున్నారు. వెంటనే స్పందించి ఆయన నెల రోజులకు సరిపోయే సరుకులు, రూ.2650తో పాటు 26 కీలోల బియ్యం అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న యువకులు ఎన్ఎస్యుఐ నాయకులకు అభినందనలు తెలిపారు. మనిషిలో దైవాన్ని గుర్తించి మానవత్వాన్ని నెలకొల్పి ఎందరో యువకులకు ఆదర్శంగా నిలిచారు. ఈ కా



ర్యక్రమంలో అభి,అభినవ్, రుమాన్,చందు,సిద్ధు,అరవింద్ పాల్గొన్నారు.



## కాంట్రాక్ట్ కార్మికుడికి అండగా ఎమ్మెల్యే జీఎంఆర్

- ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ. 20 లక్షల నష్టపరిహారం అందజేత

**పటాన్ చెరు,విశాలభారతి** ఫార్మా పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అండగా నిలిచారు. యాజమాన్యంతో చర్చించి కార్మికుడు కుటుంబానికి 20 లక్షల రూపాయల నష్టపరిహారం అందించారు. వివరాల్లోకి వెళితే..మెదక్ జిల్లా మగ్దంపూర్ గ్రామానికి చెందిన సుంకరి యాదగిరి గత కొద్ది రోజుల క్రితం జిన్నారం మండలం కాజిపల్లి గ్రామ పరిధిలోని ఆరోరా లైఫ్ సైన్సెస్ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా విధుల్లో చేరాడు. ఇటీవల పరిశ్రమలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కార్మికుడికి న్యాయం చేయాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ కు విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్.. యాజమాన్యంతో చర్చించిన ఎమ్మెల్యే జిఎంఆర్ కార్మికుడి కుటుంబానికి 20 లక్షల రూపాయల నష్టపరిహారం అందించారు. కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.

## వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం

**బాల్కొండ, విశాల భారతి** వైద్య ఖర్చుల కొసం బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఆర్థిక సహాయం చేశారు. భీమ్‌గల్ మండలం ముచ్కూర్ గ్రామానికి చెందిన ఏనుగందుల సాయవ్వ పక్షవాతంతో బాధపడుతూ తీవ్రమైన అనారోగ్యానికి గురై మంచానికి పరిమితమైంది. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ చలించిపోయి మానవత హృదయంతో వైద్య ఖర్చుల కొసం రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని పంపించారు. ఆ ఆర్థిక సహాయాన్ని గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్య



కర్తలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు బురెడ్డి సంతోషం,గట్టు మురారి,కొరడి లింబాద్రి,సొసైటీ వైస్ చైర్మన్ గంగారెడ్డి, పల్లె లింబాన్న,మంద భూమేష్,జోరిగే ప్రశాంత్,గంగయ్య,కాలనీ మహిళలు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా

www.vishalabharati.com
epaper:vishalabharati.com

vishalabharathi Telugu Daily

గురువారం,
10.10.2024
హైదరాబాద్




# విశ్వం' ఫ్యామిలీ అంతా కలిసి హాయిగా నవ్వుకోవచ్చు: హీరో గోపీచంద్



మాచో స్టార్ గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల ఫస్ట్ కొలాబరేషన్ లో వస్తున్న మోస్ట్ యాంటిసిపేటెడ్ మూవీ 'విశ్వం'. కావ్యా థాపర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ హై బడ్జెట్ ఎంటర్‌టైనర్‌ను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, వేణు దోనేపూడి చిత్రాలయం స్టూడియోస్‌పై టిజి విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. దోనేపూడి చక్రపాణి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ ట్రెమండస్ రెస్పాన్స్ తో సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. దసరా కానుకగా అక్టోబర్ 11న సినిమా గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో గోపీచంద్ విలేకరుల సమావేశంలో విశ్వం మూవీ విశేషాలని పంచుకున్నారు. శ్రీనువైట్ల గారితో సినిమా చేయాలని చాలా బ్యాక్ అనుకున్నాం. గతంలో ఓ రెండు లైన్స్ చెప్పారు. అవి బావున్నాయి కానీ నాకు సరిపోవనిపిస్తుందని చెప్పాను. తర్వాత 'విశ్వం' కథ లైన్ గా చెప్పారు. పాయింట్, గ్రాఫ్ గా చాలా బావుంది. ఇందులో అన్నీ చక్కగా కుదురుతాయనిపించింది. తర్వాత అన్నీ తన స్టయిల్ కి తగ్గట్టుగా చేసుకోవడానికి ఆయన ఏడు నెలలు సమయం తీసుకొని విశ్వం కథని ఫాం చేరు. ఇందులో కంప్లీట్ గా శ్రీనువైట్ల గారి మార్క్ తో పాటు యాక్షన్ ఫన్, కామెడీ అన్నీ పెర్ఫెక్ట్ గా వున్నాయి. శ్రీనువైట్ల గారితో వర్క్ చేయడం ఎక్సైటింగ్ అనిపించింది. 24 అవర్స్ ఆయన సినిమా తప్పితే వేరేది ఆలోచించరు. ఆయనకి సహజంగా కోపం రాదు. ఒక ఆర్టిస్ట్ కి కంఫర్ట్ జోన్ ఇచ్చి కావాల్సిన పర్ఫార్మెన్స్ ని రాబట్టుకోవడంలో ఆయన మాస్టర్. ఆఫ్టర్ లౌక్యం తర్వాత అంత మంచి ఎంటర్టైన్మెంట్ విశ్వంలో కుదిరింది. షూటింగ్ చేసేటప్పుడు నేనే కొన్ని సీన్స్ కి నవ్వు ఆపుకోలేకపోయేవాడిని. చాలామంది ఆర్టిస్టులకి సారీ కూడా చెప్పాను. సీన్స్ అంత హిలేరియస్ గా వచ్చాయి. శ్రీను వైట్ల గారి వెంకీ సినిమాలో పాపులర్ ట్రైన్ ఎపిసోడ్ ఉంది కాబట్టి డెఫినెట్ గా ఆయన నుంచి మరో ట్రైన్ ఎపిసోడ్ వస్తుందంటే కంపారిజన్ ఉంటుంది. అయితే అది వేరే జోనర్, ఇది వేరే జోనర్. అయితే ఈ కంపేరిజన్ కి విశ్వం ట్రైన్ సీక్వెన్స్ రీచ్ అవుతుంది. ఎంటర్టైన్మెంట్ చాలా అద్భుతంగా వచ్చింది. వెన్నెల కిషోర్, వీటి గణేష్, నరేష్ గారు, ప్రగతి గారు.. ఇలా అందరూ చాలా అద్భుతంగా చేశారు. ట్రైన్ సీక్వెన్స్ లో ఎంటర్టైన్మెంట్ తో పాటు చిన్న టెన్షన్ కూడా రన్ అవుతుంది. అది చాలా బాగుంటుంది. యాక్షన్ డిజైన్ రవివర్మ చేశారు. ఒక స్లీక్ యాక్షన్ గా చేద్దామని అనుకున్నారు. ఇందులో యాక్షన్ చాలా ఇంపాక్ట్ ఫుల్ గా ఉంటుంది. బేసిక్ గా ఇది హీరో స్టోరీ. పాపది కూడా వన్ ఆఫ్ ది మెయిన్ క్యారెక్టర్. పాపకి ఏడేళ్లు ఉంటాయి. కానీ పెర్ఫార్మెన్స్ చాలా అద్భుతంగా చేసింది. ఆ పెర్ఫామెన్స్ చూసి షాక్ అయ్యాను. ఆ పాప కూడా ఈ సినిమాకి చాలా ప్లస్. ఇందులో ఫాదర్ ఎమోషన్, మదర్ ఎమోషన్ అన్ని బాగా వర్కౌట్ అయ్యాయి. శ్రీనువైట్ల గారు ఎమోషన్ ని చాలా అద్భుతంగా తీశారు.

# కార్తికేయ2 నేషనల్ అవార్డ్ అందుకున్న డైరెక్టర్ చందూమొండేటి, నిర్మాత అభిషేక్ అగర్వాల్






**నేషనల్ అవార్డ్ అందుకున్న డైరెక్టర్ చందూమొండేటి, నిర్మాత అభిషేక్ అగర్వాల్**

70వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. ఉత్తమ ప్రాంతీయ చిత్రం(తెలుగు)గా 'కార్తికేయ 2' జాతీయ అవార్డ్ గెలుపొందిన సంగతి తెలిసిందే. నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా చందూ మొండేటి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్స్ పై నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 'కార్తికేయ2' ఎపిక్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. 2022కి గానూ ఉత్తమ ప్రాంతీయ చిత్రం(తెలుగు)గా నేషనల్ అవార్డ్ గెలుచుకుంది. నేడు ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జాతీయ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. కార్తికేయ 2 డైరెక్టర్ చందూమొండేటి, నిర్మాత అభిషేక్ అగర్వాల్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ అవార్డును స్వీకరించారు.

**కార్తికేయ2 చిత్ర యూనిట్‌కు తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అభినందనలు**

70వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఢిల్లీలో ఘనంగా జరిగింది. మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు పురస్కారాలను అందజేసి, అభినందనలు తెలియజేశారు. 2022 సంవత్సరానికి గానూ వివిధ విభాగాల్లో ఈ అవార్డులను అందజేశారు. తెలుగు నుంచి ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా నిలిచిన 'కార్తికేయ 2' సినిమాకు గాను, దర్శకుడు చందు మొండేటి, నిర్మాత అభిషేక్ అగర్వాల్ రాష్ట్రపతి నుంచి అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా 'కార్తికేయ2' చిత్ర యూనిట్‌కు తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ తరపున అధ్యక్షులు సునీల్ నారంగ్, గౌరవ కార్యదర్శి కె అనుపమ్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. క్రిందటేడాది 'ది కశ్మీర్ ఫైల్స్' చిత్రానికి గాను, ఈ ఏడాది 'కార్తికేయ2' చిత్రానికి గాను నిర్మాత అభిషేక్ అగర్వాల్ వరుసగా రెండు నేషనల్ అవార్డ్స్ అందుకోవడం తెలుగు చిత్ర పరిశ్రమకు గర్వ కారణంగా ఉందని అన్నారు. అలాగే 'కార్తికేయ2' చిత్ర నిర్మాణంలో భాగస్వామ్యులైన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాతలు టీజీ విశ్వ ప్రసాద్, వివేక్ కూచిభొట్లకు అభినందనలు తెలియజేశారు. నిఖిల్ హీరోగా కృష్ణతత్వాన్ని, శ్రీకృష్ణుడి గొప్పదనం తెలియజేసేలా అడ్వెంచర్ థ్రిల్లర్ మూవీగా కార్తికేయ 2 చిత్రం తెరకెక్కింది. చందు మొండేటి దర్శకత్వంలో అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్స్ పై నిర్మాతలు అభిషేక్ అగర్వాల్, టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల కలిసి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ సినిమాకు మరో సీక్వెల్ 'కార్తికేయ 3' కూడా చిత్ర బృందం ప్రకటించింది.



**కార్తికేయ 2" సినిమాకు ఉత్తమ తెలుగు చిత్రంగా జాతీయ అవార్డ్**

తెలుగు సినిమా గర్వంచే క్షణాలను చిత్ర పరిశ్రమకు అందించారు టాలెంటెడ్ డైరెక్టర్ చందూ మొండేటి. ఆయన రూపొందించిన కార్తికేయ 2 సినిమా ఉత్తమ తెలుగు చిత్రంగా జాతీయ పురస్కారాన్ని గెలుచుకుంది. ఢిల్లీలో జరిగిన ఈ వేడుకలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా కార్తికేయ 2 చిత్రానికి ఉత్తమ తెలుగు చిత్రంగా నేషనల్ అవార్డ్ స్వీకరించారు దర్శకుడు చందూ మొండేటి మరియూ నిర్మాత అభిషేక్ అగర్వాల్.

ఈ సందర్భంగా టీమ్ కు సినీ పరిశ్రమలోని పలువురు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. నిఖిల్ హీరోగా కృష్ణతత్వాన్ని, శ్రీకృష్ణుడి గొప్పదనం తెలియజేస్తూ అడ్వెంచర్ థ్రిల్లర్ మూవీగా కార్తికేయ 2 చిత్రాన్ని రూపొందించారు చందూ మొండేటి. త్వరలో ఈ సినిమాకు మరో సీక్వెల్ కార్తికేయ 3 కూడా అనౌన్స్ చేశారు. ప్రస్తుతం నాగచైతన్య హీరోగా పాన్ ఇండియా మూవీ "తండేల్" రూపొందిస్తున్నారు చందూ మొండేటి. మరికొన్ని భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ కు సన్నాహాలు చేస్తున్నారీ టాలెంటెడ్ డైరెక్టర్. ఈ చిత్రాలతో చందూ మొండేటి మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని



# దసరా కానుకగా 'వేట్టయన్ ది హంటర్'

సూపర్‌స్టార్ రజినీకాంత్ టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'వేట్టయన్- ది హంటర్'. దసరా సందర్భంగా అక్టోబర్ 10న రిలీజ్ అవుతుంది. టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ సంస్థ బ్యానర్‌పై సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మించారు. సురేష్ ప్రొడక్షన్స్‌తో కలిసి ఏసియన్ సునీల్, దిల్ రాజు ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాను సీడెడ్ ఏరియాలో శ్రీ లక్ష్మి మూవీస్ రిలీజ్ చేస్తోంది. ఈ క్రమంలో బుధవారం నాడు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో.. నిర్మాత సురేష్ బాబు మాట్లాడుతూ.. 'వేట్టయన్ ది హంటర్ సినిమాను నేను, ఏషియన్ సునీల్ గారు, దిల్ రాజు గారు కలిసి తెలుగులో రిలీజ్ చేస్తున్నాం. ఈ మూవీ మెయిన్ టైటిల్ ది హంటర్. అన్ని భాషల్లోనూ వేట్టయన్ ది హంటర్ అని రిలీజ్ చేస్తున్నారు. అందరికీ పరోక్షంగా పనులు కూడా దొరుకుతాయి. ఎక్కువ మంది జనాలు చూడాలనే మేకర్స్ మల్టీ స్టారర్లు చేస్తున్నారు. ఇప్పుడు సినిమా చూడాలంటే చాలా మాధ్యమాలు అందుబాటులోకి వచ్చాయి. కానీ థియేటర్లో అందరం కలిసి చూస్తాం. ఆ ఫీలింగ్ ఓటీటీల్లో రాదు. సినిమా కల్చర్, థియేటర్ కల్చర్‌ను కాపాడాలి. వేట్టయన్ మూవీని థియేటర్లో చూడండి. అందరికీ ఓ కొత్త ఎక్స్‌పీరియెన్స్ వస్తుంది' అని అన్నారు. దిల్ రాజు మాట్లాడుతూ.. 'లైకా ప్రొడక్షన్స్‌లో వచ్చిన ఈ చిత్రాన్ని మేం ముగ్గురం కలిసి రిలీజ్ చేస్తున్నాం. తెలుగులో వేటగాడు అనే టైటిల్‌ను పెట్టాలని అనుకున్నారు. కానీ ఆ టైటిల్ వేరే వాళ్లకి ఆల్రెడీ ఉంది. తమిళంలోనూ ఒకప్పుడు కేవలం తమిళ టైటిల్స్ మాత్రమే పెట్టాలని అనుకున్నారు. కానీ ఇప్పుడు అంతా మారిపోతోంది. సినిమా గ్లోబల్‌గా ఎదిగింది. వేరే భాషల్లో అనువాద టైటిల్స్ దొరికితే పెడుతున్నారు. లేదంటే ఒకే టైటిల్‌ను అన్ని భాషల్లోనూ రిలీజ్ చేస్తున్నారు. ఒకే టైటిల్‌తో ఉంటే చాలా బెనిఫిట్స్ ఉంటాయి. ఏ టైటిల్ పెట్టినా కూడా సినిమా బాగుంటేనే ఆడియెన్స్ చూస్తారు. సినిమాని సినిమాలా చూడండి. జై భీం వంటి అద్భుతమైన సినిమాను తీసిన టి.జె.జ్ఞానవేల్ ఈ చిత్రాన్ని కూడా అద్భుతంగా తీశారు. దసరా సందర్భంగా ఈ చిత్రం అక్టోబర్ 10న రాబోతోంది. కుటుంబ సమేతంగా అందరూచూసి ఎంజాయ్ చేసేలాఉంటుంది' అని అన్నారు. రానా దగ్గుబాటి మాట్లాడుతూ.. 'సినిమా అనే దానికి భాష లేదు.. హద్దుల్లేవు. కథను బట్టి ఆ చిత్రం ఎక్కడికైనా వెళ్లొచ్చు. ఇప్పటి వరకు రజినీకాంత్ చేసిన అన్ని సినిమాల్లోకెల్లా వేట్టయన్ చాలా భిన్నంగా ఉంటుంది. ఈ చిత్రం భారీ తారాగణంతో వస్తోంది. రజినీకాంత్ గారు, అమితాబ్ గారు, ఫాహద్ గారు, మంజు వారియర్ గారు.. ఇలా అన్ని పాత్రలు అద్భుతంగా ఉంటాయి. రియలిస్టిక్ మూవీలో ఇన్ని మంచి పాత్రలు ఉండటం చాలా అరుదు. రజినీకాంత్ గారి ముందు నిలబడి డైలాగ్ చెప్పడం, నటించే ఛాన్స్ రావడం చాలా లక్కీ. ఈ చిత్రాన్ని అందరూ చూసి ఎంజాయ్ చేయండి' అని అన్నారు.





# లవ్ రెడ్డి నుంచి ఎమోషనల్ సాంగ్ రిలీజ్

గీతాన్స్ ప్రొడక్షన్స్, సెహెరి స్టూడియో, ఎమ్జీఆర్ ఫిలిమ్స్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం "లవ్ రెడ్డి". అంజన్ రామచంద్ర, శ్రావణి రెడ్డి హీరో హీరోయిన్లు గా నటిస్తున్నారు. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా స్వచ్ఛమైన ప్రేమకథగా నూతన దర్శకుడు స్మరన్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రొడ్యూసర్స్ సునంద బి.రెడ్డి, హేమలత రెడ్డి, రవీందర్ జి, మదన్ గోపాల్ రెడ్డి, నాగరాజ్ బీరప్ప, ప్రభంజన్ రెడ్డి, నవీన్ రెడ్డి "లవ్ రెడ్డి" చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సుమ, సుస్మిత, హరీష్, బాబు, రవి కిరణ్, జకరియా సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా "లవ్ రెడ్డి" సినిమా అక్టోబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది."లవ్ రెడ్డి" సినిమా నుంచి ఈ రోజు సెకండ్ సింగిల్ 'ప్రాణం కన్నా..' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. ప్రముఖ గాయకుడు కైలాష్ ఖేర్ పాడిన ఈ హార్ట్ బ్రేకింగ్ ఎమోషనల్ సాంగ్ మ్యూజిక్ లవర్స్ ను ఆకట్టుకుంటోంది. ప్రిన్స్ హెన్రీ కంపోజ్ చేసిన ఈ పాటకు కృష్ణ కాంత్ లిరిక్స్ అందించారు. 'ప్రాణం కన్నా ప్రేమించినా..ఆ ప్రేమనే తెంచావుగా....' అంటూ ప్రేమికుడి బాధను వ్యక్తం చేస్తూ సాగుతుందీ పాట. 'ప్రాణం కన్నా..' పాటకు "లవ్ రెడ్డి" మూవీలో ఎంతో ఇంపార్టెన్స్ ఉండనుంది.

# లేడీ ఓరియెంటెడ్ ఫిల్మ్ లో సంయుక్త




వరుస బ్లాక్‌బస్టర్స్ సినిమాలతో అలరిస్తున్న టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్త తొలిసారిగా ఫీమేల్ సెంట్రిక్ మూవీ చేస్తున్నారు. సామజవరగమన, ఊరు పేరు భైరవకోన వంటి సెన్సేషనల్ హిట్ చిత్రాలను అందించిన సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండా నిర్మించనున్న ఈ చిత్రానికి యోగేష్ కెఎంసి దర్శకత్వం వహించనున్నారు. మాగంటి పిక్చర్స్‌తో కలిసి హాస్య మూవీస్ ప్రొడక్షన్ నంబర్ 6ని నిర్మించనున్నారు. సంయుక్త ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఈరోజు రామానాయుడు స్టూడియోస్‌లో పలువురు ప్రత్యేక అతిథుల సమక్షంలో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. వెంకీ కుడుముల, కోన వెంకట్ ప్రొసీడింగ్స్ ప్రారంభించడానికి మేకర్స్‌కి స్క్రిప్ట్‌ను అందజేశారు. రానా దగ్గుబాటి క్లాప్‌కొట్టగా, దిల్ రాజు కెమెరా స్విచాన్ చేశారు. దర్శకులు వశిష్ట, రామ్ అబ్బరాజు తొలి షాట్‌కి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో సురేష్ బాబు, జెమినీ కిరణ్, సాహు గారపాటి, చుక్కపల్లి అవినాష్, తదితరులు పాల్గొన్నారు. నిర్మాత రాజేష్ దండా మాట్లాడుతూ "హాస్య మూవీస్ ప్రొడక్షన్ నెం. 6 ఓపెనింగ్ కి వచ్చిన మీడియా మిత్రులకు థాంక్ యూ. ఈ ఆరో సినిమా ఒక మిరాకిల్ గా జరిగింది. సంయుక్త ఒకే సిట్టింగ్‌లో స్క్రిప్ట్‌కి ఓకే చెప్పి నెక్స్ట్ డే కి పూజ పెట్టుకోవడం అనేది నా కెరీర్ లో ఇదే ఫస్ట్ . అంత స్క్రిప్ట్ ఎక్సయిట్మెంట్ వున్న సినిమా ఇది. సంయుక్త ఓకే అంటేనే ఈ సినిమా చేద్దామని అనుకున్నాను.కమర్షియల్ యాక్షన్ థ్రిల్లర్ గా సినిమాని చేయబోతున్నాం. మిగతా విషయాలన్ని టీజర్ లాంచ్ సందర్భంగా తెలియజేస్తాము' అన్నారు దర్శకుడు యోగేష్ కెఎంసి మాట్లాడుతూ ''ఈ కథ, చిత్రానికి రాజేష్ దండా, సంయుక్త గారు కీలకం. కథ నచ్చి వెంటనే చేయడానికి ఒప్పుకున్నందుకు చాలా కృతజ్ఞతలు. ఈ కథ ఎంతలా నచ్చిందని చెప్పడానికి ఉదాహరణ సంయుక్త గారు ఈ సినిమాని ప్రెజెంట్స్ చేస్తున్నారు. సంయుక్త లాంటి గుడ్ పెర్ఫార్మర్ తోనే ఈ సినిమా చేయాలని రాజేష్ గారు నిశ్చయించుకున్నారు. ఇదంతా దైవ సంకల్పం. మిగతా విషయాలు టీజర్ లాంచ్ టైం లో చెప్తాము' అన్నారు.

# శ్వాగ్ కంటెంట్ విషయంలో చాలా ప్రౌడ్ గా ఫీల్ అవుతున్నాను: నిర్మాత టీజీ విశ్వప్రసాద్



కింగ్ ఆఫ్ కంటెంట్ శ్రీవిష్ణు, ట్యాలెంటెడ్ డైరెక్టర్ హసిత్ గోలి లేటెస్ట్ కంటెంట్ ప్యాక్డ్ బ్లాక్ బస్టర్ 'శ్వాగ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. రీతూ వర్మ హీరోయిన్ గా నటించిన ఈ చిత్రంలో మీరా జాస్మిన్, దక్ష నాగర్కర్ ఇతర కీలక పాత్రల్లో పోషించారు. అక్టోబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి, విమర్శకులు ప్రశంసలు అందుకొని కంటెంట్ ప్యాక్డ్ బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. ఈ నేపథ్యంలో మేకర్స్ గ్రాండ్ గా ఆడియన్స్ విక్టరీ శ్వాగ్ సక్సెస్ మీట్ నిర్వహించారు. ఆడియన్స్ విక్టరీ శ్వాగ్ సక్సెస్ మీట్ లో హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమా చేసే అవకాశం ఇచ్చిన నిర్మాత టీజీ విశ్వప్రసాద్ గారికి, నాకోసం ఇలాంటి మంచి కథ రాసిన హసిత్ గోలికి, సినిమా కోసం పనిచేసిన టీంలో ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. రీతు వర్మ, దక్ష, మీరాజాస్మిన్, సునీల్ గారు అందరూ చాలా అద్భుతంగా చేశారు. కొన్ని సినిమాలు బాగున్నాయి అనిపిస్తాయి. ఇంకొన్ని సినిమాలు అంత లేదులే అనిపిస్తాయి. కానీ కొన్ని సినిమాలు చూసి వచ్చిన తర్వాత కూడా మనల్ని వెంటాడుతాయి. దాని గురించి ఒక డిస్కషన్ జరిగేలా చేస్తాయి. అలాంటి సినిమానే శ్వాగ్. ఇలాంటి సినిమాలు చాలా అరుదుగా వస్తాయి. డిస్కషన్స్ నుంచి చాలా వాలిడ్ పాయింట్స్ వస్తాయి. ఇవన్నీ కూడా మేము ఫస్ట్ డే నుంచి అబ్జర్వ్ చేస్తున్నాం. సినిమా చూసినోళ్లు 90% సాటిస్ఫై అయ్యారు. 10% కొంచెం కాంప్లెక్స్ ఉంది అని ఫీల్ అయ్యారని హసిత్ చెప్పాడు. కొత్తగా ఏదైనా ప్రయత్నించినప్పుడు ఇలాంటి చిన్న చిన్నవి ఉంటాయి. శ్వాగ్ సినిమాని ఎవ్వరూ కూడా బాలేదని అనలేదు. దానికి మీ అందరికి కూడా చేతులెత్తి నమస్కరిస్తున్నాను. నేను చేసిన చాలా సినిమాలు కి ఇప్పటికీ ప్రశంసలు వస్తుంటాయి. ఆ సినిమా ప్రశంసలు ఆగిపోయి, ఈ సినిమా ప్రశంసలు మొదలవుతాయని ఆశిస్తున్నాను. ఈ ప్రశంసలు కొనసాగుతూనే ఉంటాయని నమ్ముతున్నాను. ఈ సినిమా చూసే కొద్ది కొత్త విషయాలు తెలుస్తుంటాయి. ఏ ఉద్దేశంతో ఈ సినిమా తీశామో అర్థం అవుతుంది. మమ్మల్ని గెలిపించిన తెలుగు ప్రేక్షకుల్ని గెలిపించడానికి ఈ సినిమా చేస్తున్నానని మొదటి నుంచి చెప్తున్నాను. నిజంగానే మీరంతా గెలిచారు. మీరు గెలిచి మమ్మల్ని గెలిపించారు. ఇలాంటి రిస్కులు, కొత్త కథలు ట్రై చేయకపోతే నెక్స్ట్ జనరేషన్ ని మనం ఇన్ స్పైర్ చేయలేం. ఏమీ లేని నాకు ఇంత గుర్తింపు ఇచ్చారు. తెలుగు ఆడియన్స్ రుణం తీర్చుకోవాలి. ఆ రుణం తీర్చే ప్రాసెస్లో ఇలాంటి గొప్ప కథలు చేయడానికి ప్రయత్నిస్తుంటాను. హసిత్ నా ఫ్యాన్. నాకు ఒక తమ్ముడిలా. నాకు ఇంత మంచి కథ, పాత్రలు రాసినందుకు థాంక్యూ. ఆడియన్స్ నేను చేసిన ప్రతి క్యారెక్టర్ ని చాలా ఎంజాయ్ చేస్తున్నారు. ఈసారి రాస్తే దీన్ని కొట్టేది రాయాలి. రాస్తాడనే నమ్మకం కూడా ఉంది. విశ్వ గారు మాకు ఇంత ఫ్రీడమ్ ఇవ్వకపోతే ఇలాంటి కథను చేయలేం. పీపుల్ మీడియా టీమ్ అందరికీ థాంక్యూ. సినిమాని జనాల్లోకి తీసుకెళ్లి మీడియా మిత్రులు అందరికీ థాంక్యూ. ఆ 10% కూడా కంగారు పడకండి. నెక్స్ట్ సినిమాకి వడ్డీతో సహా ఇచ్చేస్తాను. లేకపోతే లావు అయిపోతాను (నవ్వుతూ) అందరికీ థాంక్యూ' అన్నారునిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. శ్వాగ్ ని ఇంత అద్భుతంగా ఆదరించిన ఆడియన్స్ అందరికీ థాంక్యూ. సినిమాని చక్కగా ప్రమోట్ చేసిన మీడియాకి థాంక్యూ. శ్రీ విష్ణు తో అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ గా ఒక సినిమా చేయడానికి ప్లాన్ చేస్తున్నాము. అలాగే హసిత్ నెక్స్ట్ ఇయర్ మరో మూవీ చేయబోతున్నాం'అన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.